



నత్త..భయం!

- పొలాలను పట్టిపీడిస్తున్న నత్తలు
- రావూరుపాడు రైతాంగం లబోదిబో

తాళ్లపూడి, అక్టోబరు 10 : నత్తలు రైతులను నట్టేట ముంచుతున్నాయి.. కొత్త కష్టం రావడంతో రైతులు విలవిల్లాడిపోతున్నారు. ఎలా అరికట్టాలో తెలియక ఆపసోపాలు పడుతున్నారు. లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి వేసిన పంట నాలుగు రోజులకే నాశనమై పోతుండడంతో నలిగిపోతున్నారు. తాళ్లపూడి మండలం రావూరుపాడు గ్రామం కూరగాయల పంటలకు ప్రసిద్ధి. ఇక్కడ వందలాది ఎకరాల్లో అన్ని రకాలు సాగు చేస్తారు.ఆకు కూరలు, కూరగాయలు ఎక్కు వగా పండిస్తారు. క్యాలీఫ్లవర్, క్యాబేజీ, వంకాయ తదితర రకాలు సాగు చేస్తారు. వీటిని నారుదశ నుంచి పెంచాల్సి ఉంటుంది. నారు దశలోనే కాండం తినేయడంతో ఎదుగుదల ఉండడంలేదు. ఆకు కూర లదీ ఇదే పరిస్థితి. ఎందు కంటే ఇటీవల గోదావరి వరదలకు గ్రామంలో కొత్త వైరస్ పుట్టుకొచ్చింది.. అదే నత్త.. ఆ నత్తల దండు కారణంగా పంటను సర్వం కోల్పోయే పరిస్థితి ఎదుర్కొంటున్నారు. నత్త ప్రతి పంటనూ నాశనం చేస్తోంది. ఇటీవల వరదలు వచ్చిన తరువాత నత్తలు రావూరుపాడు పొలాల్లోకి చేరాయి. ప్రతి ఆకును, చెట్టును, కాయనూ తినేస్తూ అవి పెరుగుతూ పంటలను పిప్పి పిప్పి చేస్తున్నాయి.పొలాల్లో పట్టే చీడ పీడలకు దీనికి చాలా తేడా ఉంది. ఎన్ని మందుల వేసినా నత్తలు చావడం లేదని లక్షలాది రూపాయలు నష్ట పోతున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రేకపల్లి వీర వెంకట్రావు అనే రైతు మాట్లాడుతూ ఎక్కడి నుంచి వచ్చిందో తెలియదు కానీ పంటలను నాశం చేస్తుందని ఎన్నో రకాల చీడపీడలు చూశాం కానీ ఇలాంటి మొండి రకాన్ని చూడలేదని ఎన్ని మందులు వాడినా ఒకటి చస్తే వంద పుడుతూ పంటను నాశనం చేస్తున్నాయన్నారు. కాలీఫ్లవర్ మొక్కలు వేస్తే కాండంతో సహా తినేశాయని ఉద్యానవన శాఖా అధికారుల సలహాతో తవుడు, బెల్లం, మోనోక్రోటోపస్ కలిపి మొక్కలకు రక్షణగా బాటలుగా వేశామని అయినా పూర్తిగా అరికట్టలేక పోతున్నామని వాపోయారు. మరో రైతు పుప్పాల సత్యనారాయణ మాట్లాడుతూ ఎప్పుడూ ఈ గ్రామంలో నత్తలు లేవని నత్తలు కనపడడం ఇదే మొదటిసారి అని వీటిని అరికట్టక పోతే చుట్ట ప్రక్కల గ్రామాల రైతులకు కూడా ప్రమాదం ఉందని అధికారులు ఉన్నతస్థాయిలో పరిశోధన జరిపి రైతులను ఆదుకోవాలని కోరారు. లేకపోతే మండలం మొత్తం వ్యాపించే ప్రమాదం ఉందని.. అధికారులు మేల్కోవాలన్నారు.

నత్తలను నిర్మూలించలేం..

ఉప్పు చల్లడం ద్వారా నత్తలను నివారించవచ్చు. గోనె పట్టాలను తడిపి నత్తలు తిరిగే ప్రదేశాల్లో నేలపై పరచాలి. చల్లదనానికి గోనె పట్టాల కిందకి చేరిన నతలను పట్టుకుని ఉప్పునీటి ద్రావణంలో వేయడం ద్వారా అరికట్టవచ్చు. పంటలను కాపాడుకోవడానికి చర్యలు తప్ప నత్తలను సమూలంగా నిర్మూలించలేం.

- ఏవో రుచిత, హార్టికల్చర్ అధికారి శ్రీనివాస్

రొటీన్ లైఫ్‌కి భిన్నంగా!

జీవితం అంటే ఇంతేనా.. చాలా మందికి వచ్చే క్వశ్చన్ మార్క్ ఇది.. కొత్తగా ఏదో ఒకటి చేయాలని అనుకుంటారు.. అయితే అందరూ అలా చేయలేదు.. కొంత మంది మాత్రమే ఆ వైపు అడుగులు వేస్తారు.. ఈ చిత్రంలో చూస్తున్నారుగా ఇతని పేరు అన్నెంనీడి మనోజ్ కుమార్.. బెంగళూరులో ఐటీ ఉద్యోగి.. ఏ కష్టం లేదు.. ఆ జీవితం రొటీన్ అనిపించింది.. దేశంలో ఐదు వేల కిలోమీటర్లు సైకిల్ యాత్ర చేయాలని తలంచారు.. అనుకున్నదే తడవుగా గత నెల 28వ తేదీన యాత్ర ప్రారంభించారు.. గురువారానికి రాజమహేంద్రవరం చేరుకున్నారు.. 48 రోజుల్లో మరో 4 వేల కిలోమీటర్లు కవర్ చేయాలని చెప్పుకొచ్చారు.. రాజమహేంద్రవరం లో తన మావయ్య ఉన్నట్టు చెప్పారు.

- రాజమహేంద్రవరం సిటీ



చిరుత..కు ఏమైంది!?



చిరుత ముందుగా కెమెరాకు చిక్కిన ప్రాంతమిదే..

- గత నెల 6న ప్రత్యక్షం
- రిజర్వు ఫారెస్టులో 18 రోజులు
- బోనుకు చిక్కకుండా తిరిగిన వైనం
- చివరిగా వీరవరంలో అడుగులు
- రావులపాలెంలో పుకార్లు
- అక్కడి నుంచి కానరాని జాడ
- 35 రోజులైనా స్పష్టత శూన్యం
- బతికే ఉందా? అనే అనుమానం
- జనాల్లో ఇంకా వీడని భయం..
- అటవీ అధికారుల మౌనం


అడవి నుంచి జనారణ్యంలోకి వెళ్లి అదృశ్యం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

అడవిలో ఉండాల్సిన చిరుత దారితప్పి జనార ణ్యంలోకి వచ్చి అదృశ్యమైంది. నెల రోజుల పాటు అటవీ అధికారుల హడావుడి నుంచి చాకచక్యంగా తప్పించుకుంటూ ట్రాప్ కెమెరాలకు మాత్రం ఫోజులిచ్చింది. తర్వాత జాడ మాయమైంది. అసలు చిరుత బతికే ఉందా? జనాల్లో ఉందా? వనాలకు వెళ్లిపోయిందా?..ఏ ప్రశ్నకూ ఇతమి త్థంగా సమాధానం లేదు. జనాలు ఇప్పటికీ భయపడుతూనే సంచరిస్తుండగా అటవీ అధికారులు మాత్రం పది రోజుల నుంచీ దాని ఊసే మరి చినట్టుగా కనిపిస్తోంది.చిరుత సమాచారాన్ని మీడియాకు చేరవేయడానికి ఏర్పాటు చేసిన వాట్సాప్ గ్రూపు కూడా ఈ నెల 1 నుంచి మూగ బోయింది. ఇటీవల బెంగళూరులో ఓ చిరుతపులి అకస్మాత్తుగా ఓ ప్రయాణికుల బస్సుపై దాడి చేసి కిటికీల గుండాలోపలికి ప్రవేశించడానికి ప్రయ త్నించిన వీడియో హల్‌చల్ చేస్తుండడంతో ఇక్కడి ప్రజల్లో మళ్లీ ఆందోళన మొదలైంది.ఏ మూల నక్కి ఉందో.. ఠక్కున ఎప్పుడొస్తుందో అనే భయం ఇప్పటికీ ఉంది. జనాల్లో భయం.. అధికారుల్లో మౌనంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

గత నెల 6న చిరుత జాడ

చిరుత జాడను దివాన్ చెరువు రిజర్వు ఫారె స్టులో గత నెల 6వ తేదీన గుర్తించారు.ఆ తర్వాత అటవీ అధికారులు 70 ట్రాప్ కెమెరాలు, 10 వరకూ బోనులు, సుమారు 100 మంది సిబ్బంది, థర్మల్ ఇమేజ్ డ్రోన్ కెమెరా, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అయినా రిజర్వు ఫారెస్టులో ఉన్నంత వరకూ దానిని బంధించలేక పోయారు. అనంతరం దివాన్‌చెరువు అభయారణ్యం నుంచి సుమారు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న కడియపులంకలోని ఓ నర్సరీలో ప్రత్యక్షమైంది.తర్వాత నుంచి దాని జాడ అదృశ్యమైంది. ఓ పది రోజులుగా ఫారెస్టు సిబ్బంది మర్చిపోయారు.చిరుత వెనక్కి వెళ్లిపోయి ఉండొచ్చని ఇప్పుడు అధికారులు అంచనా వేస్తున్నారు. ఏ అంశాలను పరిగణనలోకి తీసుకొని చిరుత వెనక్కి వెళ్లి ఉండొ చ్చని చెబుతున్నారో తెలియడం లేదు. పులి, చిరుత వంటి వణ్యప్రాణులు వాటి విసర్జితాల వాసన ఆధారంగా సంచరిస్తూ ఉంటాయి.ఇప్పు డు చిరుత వెనక్కి వెళ్లాలంటే ఆ ఆధారాలు కూడా లేవు. వర్షాల వల్ల చెరిగిపోయాయి. కడియపులంక నుంచి దివాన్ చెరువు వరకూ చిరుత రావడం చాలా కష్టం. ఇక కిలోమీటర్ల అవతల ఉన్న దాని గూటికి చేరుకోవడం ఊహకు అందని అంశం.



గత నెల 6న కెమెరాకు చిక్కిన చిరుత (ఫైల్)

ప్రయత్న లోపమేనా?

తూర్పుగోదావరి డీఎఫ్‌వో దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో కాకినాడ జిల్లా అటవీ అధికారి (డీఎఫ్‌వో)ని ఇంచార్జి డీఎఫ్‌వోగా నియమించారు. ఆమె నేతృత్వంలో సుమారు 50 మంది బృందా లుగా ఏర్పడి చిరుత కోసం అన్వేషణ సాగిం చాయి. 530 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్న రిజర్వు ఫారెస్టులో 50 వరకూ ట్రాప్ కెమెరాలను, ఇన్‌ఫ్రారెడ్ కెమెరాలను చెట్లకు బిగించారు.చిరుత పులి కడియపులంకలో కనిపించిన వెంటనే కోన సీమ డీఎఫ్‌వోని రంగంలోకి దింపారు. అయినా ఫలితం శూన్యం. ఇప్పుడు తూర్పు డీఎఫ్‌వో బదిలీపై వెళ్లి కొత్తగా రవీంద్ర ధామా రెండు రోజుల కిందట జాయిన్ అయ్యారు. ఈయన మళ్లీ వెతుకులాట ఎక్కడి నుంచి ఆరంభిస్తారో చూడాల్సిందే.

చిరుత బతికే ఉందా?

గత నెల 6న రాజమహేంద్రవరం శివార్లలో చిరుత సంచారం వెలుగు చూసింది. చివరిగా గత నెల 19న ట్రాప్ కెమెరాకు చిక్కింది. సుమారు 20 రోజులవుతున్నా కెమెరాలో ఫొటో, పాదముద్రలు, జంతువులను వేటాడిన, మనుషులపైకి వచ్చిన అనుపానులు లేవు. అసలు ఎవరికీ కనిపించిన దాఖలా లేదు. ట్రాప్ కెమెరాలు, సీసీ కెమెరాలు,అటవీ శాఖ బృందాలు జాడ గుర్తించే పనిలోనే ఉన్నాయని, బోన్లు కూడా ఇంకా తీయలేదని అటవీ అధికారులు చెబుతున్నాయి.ఆయా ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయడం మాత్రం ఆపేసినట్లే కనిపిస్తోంది. అయితే వెనక్కి మళ్లి ఉండొచ్చని అంటున్న అధికారులు.. ముందుకు ఎందుకు వెళ్లకూడదనే ఆలోచన చేయడం లేదని తెలుస్తోంది.కడియపులంకలో చివరిగా కనిపించిన తర్వాత రావులపాలెంలో కనిపించిందనే చర్చ నడి చింది. అలా ముందుకు వెళ్లిందని అనుకుంటే కాకినాడ, అమలాపురం వైపు ప్రయాణించే అవకా శం లేకపోలేదు. లంకల్లోకి వెళ్లే క్రమంలో లేదా గోదావరి పాయలు దాటే సమయంలో చిరుతకు హాని జరిగిందా? అనే అనుమానాలు బలపడుతున్నాయి.గత నెల 29న కోనసీమ పరిధిలోకి వచ్చే గోదావరి నదిలో చిరుతను చూశామని కొందరు మత్స్యకారులు చెప్పగా అటవీ సిబ్బంది వెళ్లి వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో గోదావరి ఒడిలో ప్రమాదానికి గురైందా?లేక ఎక్కడైనా ఊబిల్లో చిక్కుకుందా అనే వాదనా లేకపోలేదు. అదే గనుక నిజమైతే వన్యప్రాణిని దక్కించుకోలేని మరక జిల్లాకు అంటుకోక తప్పకపోవచ్చు.చిరుత వల్ల తాత్కాలి కంగా మూసేసిన పుష్కర వనాన్ని ఈ నెల 2 నుంచీ తెరిచారు.ఒకవేళ అధికారుల అంచనా వేస్తున్నట్టు వెనక్కి మళ్లి ఉంటే దివా న్ చెరువు రిజర్వు ఫారెస్టులోకి ప్రవే శించి ఉండాలి.కానీ ఇక్కడా ఏలాంటి జాడా లేదు. ఇలా భయంతో రకరకాల అయోమయాలు ప్రజల మెదడును తొలిచేస్తున్నాయి.

గత నెల 24న చివరిగా..

చిరుత సమాచారంపై ప్రతి రోజూ ఫారెస్టు అధికారులు మీడియాకు సమాచారం ఇస్తూ వచ్చారు.ఈ క్రమంలో ఒక వాట్సాప్ గ్రూప్‌ని క్రియేట్ చేశారు. ఇది ఈ నెల 2 నుంచి మూగ బోయింది. చివరిగా 1వ తేదీ సాయంత్రం ఇన్ చార్జి డీఎఫ్‌వో భరణి పేరుతో.. 'చివరిగా సెప్టెంబరు 19న దివాన్ చెరువు అటవీ ప్రాం తంలో చిరుతపులి తిరుగుతున్నట్టు ట్రాప్ కెమె రాకు చిక్కింది. 24న రాత్రి కడియం నుంచి వీరవరం వెళ్లే రోడ్డులో దోసాలమ్మ కాలనీ దగ్గర లోని ఎస్ఎస్‌టీసీ నర్సరీలో చిరుతపులి పాద ముద్రలు గుర్తించాం.అదే రోజున వర్షం పడడంలో ఆ పాదముద్రలు పోయినవి. 19 నుంచి 30 వరకూ దివాన్ చెరువు అటవీ ప్రాంతంలో, పరిసర ప్రాంతాల్లో అమర్చిన ట్రాప్ కెమెరాలను, సీసీ కెమెరాలను పరిశీలించగా చిరుతపులి కదలికలు లేవు. 29న అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో గోదావరి నదిలో మత్స్యకారులు చూసినట్టుగా వచ్చిన సమాచారంపై సిబ్బంది ఆరు బృందాలుగా ఏర్పడి ఆ ప్రాంతాల్లో క్షుణ్ణంగా తనిఖీ చేసినా ఎలాంటి ఆధారాలూ లభించలేదు. రేపటి(ఈ నెల 2) నుంచి చిరుతపులి జాడ కోసం రెండు బృందాలను ఏర్పాటు చేసి తూర్పుగోదావరి జిల్లా దివాన్ చెరువు, కడియం, కోనసీమ జిల్లా రావులపాలెం పరిసరాలు, గోదావరి లంకల్లో గాలింపు చర్యలు చేపట్టడం జరుగుతుంది. లాలా చెరువులోని గోదావరి పుష్కరవనాన్ని 2వ తేదీ నుంచి తిరిగి పునఃప్రాంభిస్తారు' అని పోస్టు పెట్టారు.

మంత్రి నాదెండ్ల తనిఖీ.. 96,270 కేజీల బియ్యం పట్టివేత

- 3 రైస్‌మిల్లుల్లో చిక్కిన బియ్యం
- విలువ రూ.36,52,285 : జేసీ



నల్లజర్లలో తనిఖీ చేస్తున్న మంత్రి నాదెండ్ల(ఫైల్)

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 10: రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ జిల్లా పరిధిలో ఈనెల 9న రాత్రి నిర్వహించిన తనిఖీల్లో మొత్తం 96,270 కేజీల పోర్టిఫైడ్ బియ్యం గుర్తించారని జేసీ పి.చిన్నరాముడు తెలిపారు. ఈ మేరకు మంత్రి తనిఖీల్లో పట్టుబడిన బియ్యం వివరాలను గురువారం వెల్లడించారు. నల్లజర్ల శ్రీ వెంకట సత్యరైస్ అండ్ ఫ్లోర్ మిల్లులో ఎటువంటి రికార్డులు లేకుండా ఉన్న రూ. 36.40 లక్షలు విలువ చేసే 80 వేల కేజీల బియ్యం, దేవరపల్లికి చెందిన వరలక్ష్మి రైస్‌మిల్లు యజమాని సిహెచ్.అప్పారావుకు సంబంధించిన రూ.12,285 విలువ చేసే 270 కేజీల బియ్యం, దేవరపల్లికి చెందిన శ్రీవెంకటేశ్వరా రైస్‌మిల్లు యజమాని సిహెచ్ హరిబాబుకు చెందిన 16 వేల కేజీల బియ్యం సీజ్ చేసారని తెలిపారు.మొత్తం పట్టుకున్న బియ్యం విలువ రూ.36,52,285లు ఉంటుందన్నారు. సంబంధిత వ్యక్తులపై నిత్యావసర వస్తువుల చట్టం 1955 సెక్షన్ 6ఎ ప్రకారం కలెక్టర్ (పౌరసరఫరాలు) జిల్లా కోర్టులో కేసు నమోదు చేశారన్నారు. సంబంధిత పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసులు నమోదు చేసినట్టు పేర్కొన్నారు.

14 షాపులు.. 614 దరఖాస్తులు

మూడు మండలాల్లో రూ. 12.28 కోట్ల ఆదాయం

దేవర పల్లి, అక్టోబరు 10 : దేవరపల్లి ఎక్సయిజ్ స్టేషన్ పరిధిలో 14 షాపులకు 614 దరఖాస్తుల ద్వారా రూ.12.28 కోట్ల ఆదాయం సమకూరిందని దేవరపల్లి ఎక్సయిజ్ సీఐ బళ్ళా శ్రీనివాసరావు అన్నారు. దేవరపల్లి ఎక్సయిజ్ సీఐ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. దేవరపల్లి సర్కిల్ పరిధిలో దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాలకు 14 షాపులు కేటాయించగా బుధవారం సాయంత్రానికి 614 దరఖాస్తులు అందాయన్నారు.దేవరపల్లి మండలం 5, గోపాలపురం మండలం3, నల్లజర్ల మండలంలో 6 షాపులకు అనుమతివ్వడం జరిగిందన్నారు.

పుట్టినరోజు పార్టీకి డ్రగ్స్

పోలీసులకు చిక్కిన తాడేపల్లిగూడెం యువకులు

8

ఇసుక.. టెండరింగ్!

17 ఓపెన్ రీచ్‌లకు 145 దరఖాస్తులు



మాకు వస్తుందో రాదో : కలెక్టరేట్‌లో జేసీ చాంబర్ వద్ద ఓపెన్ ఇసుక ర్యాంపు కేటాయింపునకు బయట వేచి ఉన్న టెండరుదారులు

- ఇసుక టెండర్లలో గుత్తాధిపత్యం
- ముందుగానే కేటాయింపులు?
- ఆ తరువాతే టెండర్లు
- చక్రం తిప్పిన ఒక నేత అనుయాయులు
- దరఖాస్తుదారుల విస్మయం

రాజమహేంద్రవరం రూరల్/ సిటీ, అక్టోబరు 10 : ఓపెన్ ఇసుక ర్యాంపులు అక్రమార్కులకు ఓపెన్ అయినట్టు తెలిసింది. ఆయా ర్యాంపుల్లో టెండరింగ్ అయినట్టు సమాచారం. ఎవరికి ఏ ర్యాంపు కావాలో ముందుగానే నిర్ణయించి అధికారుల చెవిన వేసినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. దీంతో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచిత ఇసుక విధానం ఏ విధంగా సాగుతుందోననే అనుమానాలున్నాయి. జిల్లాలో ఓపెన్ ఇసుక ర్యాంప్‌ల కేటాయింపుల కోసం ప్రభుత్వం నిర్వహించిన టెండర్లలో ఇద్దరు కీలక నాయకులు గుత్తాధిపత్యం ప్రదర్శించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జేసీ చాంబర్ వద్ద కూర్చుని వారు ఓపెన్ ర్యాంప్‌ల కేటాయింపుల కోసం నిర్వహించిన టెండర్ల ప్రక్రియలో చక్రం తిప్పారు. వారి హవాకు అధికారులు సైతం మిన్నకుండడం పలు విమర్శలకు తావిస్తోంది. పలువురిని బుధవారం టెండర్లు దాఖలు చేయకుండా అడ్డుకున్న నాయకులు గురువారం కేటాయింపులు జరిగిన ప్రక్రియలో కూడా ప్రతి ర్యాంపులోను వేలు పేట్టేశారు. జిల్లాలో 17 ఓపెన్ రీచ్‌లు ఉన్నాయి. వేమగిరి దగ్గర రెండు రీచ్‌లు, బుర్రిలంక, వెంకటనగరం, బొబ్బిల్లంక, వంగలపూడి, సీతానగరం మూడు, తాళ్ళపూడి, కొవ్వూరు రూరల్ 2, పెరవలి 2, నిడ దవోలు తదితర ర్యాంపులు ఉన్నాయి. 17 ఓపెన్ రీచ్‌లకు సం బంధించి మొత్తం 145 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో ఆయా టెండరుదారులు వేసిన బిట్‌లను బట్టి కేటాయింపులు చేయాల్సి ఉంది. అయితే ఆయా కేటాయింపుల్లో కూడా వారు ప్రమేయం ప్రదర్శించడం విడ్డూరంగా ఉంది.జేసీ చాంబర్‌లో శాండ్ కమిటీ అధికారులతో పాటు వారిద్దరు కూర్చుని చక్కబెట్టినట్టు సమాచారం. ఇసుక రీచ్‌ల కేటాయింపులను చాలా పారదర్శకంగా నిర్వహించాలని కూటమి ప్రభుత్వం యోచించి అధికారులకు అన్నీ అప్పగిస్తే వారిని ఒత్తిడి చేసి సీనియర్ ఎమ్మెల్యే అనుచరులు ఇద్దరు అను సరిస్తున్న విధానాలు ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఇసుక టెండర్లు ప్రభుత్వానికి మచ్చ

ఇసుక టెండర్లు కేటాయింపుల్లో జేసీ ఛాంబర్‌లో కొంత మంది గుత్తేదారుల దౌర్జన్యం కూటమి ప్రభుత్వానికి మచ్చ తీసుకువస్తుందని బీజేపీ ఓబీసీ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపి శ్రీనివాస్ ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసుక కొరత రాకుండా చూసి భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలను కాపాడాలన్నారు. అధికారులు నిబంధనలు పాటించాలన్నారు. టెండర్లు పిలిచిన విధానంలో ఉన్న లోపాలు చూస్తేనే ఎంత అక్రమంగా జరిగిందో అర్థమవుతుందన్నారు.గత ప్రభుత్వం ఇసుక అక్రమాల్లో పాలు పంచుకున్న గుత్తేదారులు ఇప్పుడు టెండర్లలో కూడా పాల్గొని గుత్తాధిపత్యం చెలాయించడం కనిపిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచిత ఇసుక పాలసీకి గుత్తేదార్లు తూట్లుపొడుస్తున్నారని ధ్వజమెత్తారు.



వంట నూనెలు కాగుతున్నాయ్!

రెండు నెలలుగా పెరుగుతున్న ధర

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

వంటనూనె ధరలు భగ్గుమంటున్నాయి.. ఎక్కడా దిగిరావడంలేదు..అంతకంతకూ పెరుగుతూనే ఉన్నాయి. దిగుమతి సుంకం పెంచారనే కారణంతో వంట ఆయిల్ ధరలు విపరీతంగా పెంచేశారు. కొద్ది రోజుల కిందటే ధరలు పెంచగా ప్రభుత్వం ఆగ్రహించి అధికారులతో విస్తృతంగా దాడులు చేయించడంతో కేసులు కూడా నమోదు చేశారు. దీంతో కొద్ది రోజులు నూనె ధరలు అరికట్టిన సంగతి తెలిసిందే. కానీ వ్యాపారులు మళ్లీ నూనె ధరలు పెంచారు. అయితే మళ్లీ ఏం జరిగిందో తెలియదు కానీ ధరలు మాత్రం కిలోకు రూ. 20ల మేర పెంచేయడం గమనార్హం.ఫ్రీడమ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ రెండు నెలల కిందట రూ.112లు మాత్రమే ఉండేది. ప్రస్తుతం కేజీ రూ.130కు విక్రయిస్తున్నారు. కొద్దిరోజుల కిందటి వరకూ రూ.110 నుంచి రూ.115 వరకూ అమ్మేవారు.పామాయిల్ రూ. 120లకు విక్రయిస్తున్నారు. పది కేజీల ఆయిల్‌కు హోల్‌సేల్‌లో సుమా రు 300 పెరిగినట్టు చెబుతున్నారు.పాత నిల్వలను ధరలు మార్చి అమ్మేస్తున్నారు. అయినా అధికారులెవరూ పట్టించుకోవడంలేదు. మరో పక్క మార్కెట్‌లో కందిపప్పు కేజీ ధర రూ. 151కే అమ్మాలని అధికారులు ఆదే శించినా వేంకటేశ్వర మార్కెట్‌లో రూ.170 తీసుకుంటున్నారు. ఎవరైనా ఇదేంటని అడిగితే ఇది మంచిరకం అని చెబుతున్నారు.

వంట నూనె ధరలు తగ్గించాలి జేసీ చిన్నరాముడు

వంటనూనెలను వినియోగదారులకు తక్కు వ ధరలకే విక్రయించాలని జేసీ ఎస్. చిన్నరాముడు సూచించారు. పౌరసరఫరాల కార్యాలయంలో గురువారం నిర్వహించిన ధరల పర్యవేక్షణ కమిటీ సమీక్షలో పలు సూచనలు చేశారు.హోల్‌సేల్, రిటైల్ వద్ద ధరల పట్టిక ఏర్పాటు చేయాలని ఆదేశించారు.అన్ని హోల్‌సేల్,రిటైల్ మార్కెట్లలో నిబంధనల మేరకు మాత్రమే ధరలు ఉండాలన్నారు.రైతు బజార్లు, మండల కేంద్రాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. అధికారులు తనిఖీ చేయాలన్నారు.



మెట్టవాడ వాగుపై సన్నివేశాల చిత్రీకరణ (పైన), నటుడు నాజర్ (కింద)

మన్యంలో సినీ సందడి



మోతుగూడెం, అక్టోబరు 10: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం మోతుగూడెం పరిధిలోని చదలవాడ పంచాయతీ మెట్టవాడ పరిసరాల్లో షూటింగ్ సందడి నెలకొంది. ప్రముఖ దర్శకుడు ఆదిత్య వేపాటి దర్శకత్వంలో సీనియర్ నటుడు నాజర్ ముఖ్య కథా నాయకుడిగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. మెట్టవాడ, వీఆర్ పురం మండలంలోని కొన్ని ప్రాంతాల్లో పలు సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. గురువారం మోతుగూడెం పరిసర ప్రాంతాల్లో షూటింగ్ జరిగింది. సుమారు 15 రోజులు పాపికొండలు, అభయారణ్యంలో చిత్రీకరణ జరిగినట్టు తెలిసింది. దారేపల్లి గ్రామ సమీపంలోని కొండపై షూటింగ్ జరుగుతోందని తెలిసి పరిసర గ్రామాల నుంచి ప్రజలు తండోపతండాలుగా తరలి వస్తున్నారు. అభిమానులు నాజర్‌తో సెల్ఫీలు, ఫొటోలు దిగుతున్నారు.



ఆరడుగుల బతుకమ్మకు పూజలు నిర్వహిస్తున్న మహిళలు

ఆటపాటలతో బతుకమ్మ ఊరేగింపు

వరరామచంద్రాపురం, అక్టోబరు 10: అల్లూరి సీతారామరాజు జిల్లా వీఆర్ పురంలో గోల్డ్ షాపు జగదీష్ ఆధ్వర్యంలో బంతిపూలతో ఆరు అడుగుల బతుకమ్మను తయారు చేశారు. దానిని మండపంలో ఆశీనులు చేసి మహిళలు తెచ్చిన బతుకమ్మలను చుట్టూ ఉంచి దీపారాధన చేసి పూజలు జరిపారు. బతుకమ్మలను నెత్తిన పెట్టుకుని, ఆరు అడుగుల బతుకమ్మను త్రిచక్ర వాహనంపై ఉంచి తెలంగాణ సంప్రదాయం ఉట్టిపడేలా ఆటపాటలతో ఊరేగించారు. అనంతరం పవిత్ర గోదావరిలో నిమజ్జనం చేశారు.



శివాంజనేయ నర్సరీలో ఎన్‌సీసీ ట్రైనీలు

ఎన్‌సీసీ ట్రైనీలు...నర్సరీ సందర్శన

కడియం, అక్టోబరు 10: తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం కడియపులంకలోని శివాంజనేయ నర్సరీని స్పెషల్ నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంపు-2024కు విచ్చేసిన ఎన్‌సీసీ ట్రైనీలు గురువారం సందర్శించారు. దేశంలోని 28 రాష్ట్రాలకు చెందిన 18 ఎన్‌సీసీ డైరెక్టరీస్ నుంచి వచ్చిన మంది విద్యార్థులు వివిధ జాతుల మొక్కలు, బొన్సాయ్ రకానికి చెందిన మొక్కలను తిలకించారు. కార్యక్రమంలో నర్సరీ సంఘం అధ్యక్షుడు మల్లు పోలరాజుకు, ఉపాధ్యక్షుడు పెనుమాక కొండబాబు, డైరెకర్లు గాద నాగేశ్వరరావు, తాడాల బాలమురళీకృష్ణ పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తి తప్పనిసరి

బాస్కెట్‌బాల్ పోటీల ప్రారంభోత్సవంలో ఎంపీ బోస్

రామచంద్రపురం (ద్రాక్షారామ), అక్టోబరు 10: నేటి సమాజ స్థితిగతులను ఎదుర్కోవడానికి క్రీడా స్ఫూర్తి తప్పనిసరి అని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ అన్నారు. ఏపీ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగే జీఎంసీ బాలయోగి స్మారక 9వ సబ్ జూనియర్ అంతర్ జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీలు రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎంపీ బోస్ మాట్లాడుతూ వరల్డ్ క్లాస్ యూనివర్శిటీలు సైతం సీట్లలో 5 శాతం క్రీడలకు కేటాయించడమే ఇందుకు ఉదాహరణ అన్నారు. రామచంద్రపురం బాస్కెట్‌బాల్ అసోసియేషన్‌కు ఎంతో ఖ్యాతి ఉందన్నారు. ఎంతో మంది దాతలు, అసోసియేషన్ ప్రతినిధులు కృషితో ఇది సాధ్యమైందన్నారు. సహకరిస్తున్న వారికి కృతజ్ఞతలు తెలుపుతూ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి గన్నమని చక్రవర్తిని బోస్ ప్రత్యేకంగా అభినందించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ గరిగిపాటి సూర్యనారాయణమూర్తి, డాక్టర్ కోట సునీల్, మోడరన్ విద్యా సంస్థల అధినేత లయన్ జీవీ రావు, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి గన్నమని చక్రవర్తి, ఉపాధ్యక్షుడు జి.భూషణరావు, టెక్నికల్ కమిటీ ఛైర్మన్ సురేష్‌బాబు, జాయింట్ సెక్రటరీ మాణిక్యాలరావు, డాక్టర్ చెలికాని రామారావు పాల్గొన్నారు. తూర్పు గోదావరి, కడప జట్లను ఎంపీ బోస్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి పరిచయం చేసుకున్నారు. రాష్ట్రంలో వివిధ జిల్లాల నుంచి 11 బాలుర జట్లు, 9 బాలికల జట్లు పోటీల్లో పాల్గొంటున్నాయి. తూర్పు గోదావరి, కడప బాలికల జట్ల మధ్య తొలి మ్యాచ్ జరిగింది.

21 నుంచి వాడపల్లి వెంకన్న బ్రహ్మోత్సవాలు

ఆత్రేయపురం, అక్టోబరు 10: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 21 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించనున్నారు. వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవిల్లి రాజేశ్వరవరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేద పండితులు, అర్చకులు క్రతువును నిర్వహించనున్నారు. పలు రాష్ట్రాలకు చెందిన వాయిద్య కళాకారుల ప్రదర్శనలు, ఫల, పుష్ప, విద్యుత్ సొబగులతో బ్రహ్మోత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ఉప కమిషనరు నల్లం చక్రధరరావు చర్యలు చేపట్టారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలపై సమీక్ష నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు ఆలయ ప్రాంగణంలో పందిరిరాట నిర్వహించే కార్యక్రమాన్ని గురువారం ఉదయం శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేద పండితులు, అర్చకులు పందిరిరాట వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి యాగశాల నిర్మాణానికి, బ్రహ్మోత్సవ పనులకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, సర్పంచ్ కాయల జగన్నాథం, సూపరింటెండెంట్లు శ్రీనివాస్, రాంబాబు, టీడీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు యేపుగంటి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



పందిరి రాట పాతి ఉత్సవ పనులకు శ్రీకారం చుడుతున్న దృశ్యం





బగళాముఖి అలంకరణలో ఐశ్వర్యాంబిక అమ్మవారు, శతకోటి కుంకుమార్చనలో పూజ చేస్తున్న మహిళలు

అమ్మ పలుకే శ్రీరామరక్ష



శ్రీపీఠం అధిపతి పరిపూర్ణానంద సరస్వతి

ఎనిమిదో రోజుకు మహాశక్తి యాగం

సర్పవరం జంక్షన్, అక్టోబరు 10: కాకినాడ శ్రీపీఠంలోని గోశాల ప్రాంగణం భక్తజన సంద్రంగా మారింది. స్వామి పరిపూర్ణానంద సరస్వతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాశక్తి యాగం శుక్రవారం 8వ రోజుకి చేరింది. శతకోటి కుంకుమార్చన, బగళాముఖి అమ్మవారికి జప, హోమాలు, దేవీ కవచం, నవగ్రహ పరిహారం కోసం లక్ష మంత్రార్చన, శ్రీలలిత సహస్ర విరాట్ పారాయణం వేద పండితుల మంత్రోచ్ఛారణలతో జరిగాయి. స్వామీజీ అనుగ్రహభాషణ చేస్తూ... ప్రపంచంలో అమ్మను మించిన దైవం లేదని, అమ్మ పలుకే శ్రీరామరక్ష అన్నారు. శతకోటి కుంకుమార్చన 90 కోట్లకు చేరిందన్నారు. 15 రకాల ఆపదల నుంచి బయటపడాలంటే అమ్మవారి మంత్రాన్ని జపించాలన్నారు. అమ్మ పాదాలను విడిచిపెట్టకండి, గురువు పాదాలను మరిచిపోకండి అని పిలుపునిచ్చారు. ఈ మహా క్రతువులో పాల్గొనేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి సుమారు 70 వేలకు పైగా భక్తులు తరలి వచ్చారు. కాకినాడ ఎస్‌డీపీవో రఘువీర్ విష్ణు ఆధ్వర్యంలో సర్పవరం, కాకినాడ రూరల్, కాకినాడ టౌన్ సీఐలు బి.పెద్దిరాజు, డీఎస్ చైతన్యకృష్ణ, ట్రాఫిక్ డీఎస్పీ డి. రామారావు, పలువురు సీఐలు, ఎస్‌ఐలు, హెచ్‌సీ, కానిస్టేబుళ్లు బందోబస్తు నిర్వహించారు.

పుట్టినరోజు పార్టీలో గంజాయి... ఎంజాయ్

డ్రగ్స్ కలకలం కేసులో నలుగురు నిందితుల అరెస్టు ... 4 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్, 50 గ్రాముల గంజాయి, కర్ణాటక రాష్ట్రానికి చెందిన 5 లిక్కర్ ఫుల్ బాటిల్స్, కారు స్వాధీనం

రాజానగరం, అక్టోబరు 10: యువత ఆన్‌లైన్ మాయా జాలంలో చిక్కుకుపోతున్నారు. ఒకప్పుడు మహా నగరాలకు మాత్రమే పరిమితమైన మాదకద్రవ్యాల వినియోగం, పబ్ సంస్కృతి నేడు మారుమూల పల్లెలకు సైతం వ్యాపించింది. నేటి యువత డ్రగ్స్‌కు బానిసలుగా మారి భవిష్యత్తును చేజేతులా నాశనం చేసుకుంటున్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం జి.యర్రంపాలెం గ్రామ శివారులో కొందరు యువకులు డ్రగ్స్‌తో పట్టుబడడమే ఇందుకు నిదర్శనం.

రాజానగరం సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్, ఎస్‌ఐ మనోహర్‌లతో కలిసి రాజానగరం పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రాజమహేంద్రవరం ఇన్‌చార్జి డీఎస్పీ జి.దేవకుమార్ పలు వివరాలు వెల్లడించారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడేనికి చెందిన దేవభక్తుల దినేష్, వేమన విక్రమ్ రాధా గగన్, బాలం అజయ్, దువ్వనబోయిన పుష్పరాజు స్నేహితులు. వీరిలో దినేష్, పవన్‌కుమార్‌లకు ఎండీఎంఏ డ్రగ్స్, అజయ్, పుష్పరాజులకు గంజాయి తాగే అలవాటుంది. ఈ నెల 10వ తేదీన దినేష్ పుట్టినరోజు వేడుకలకు రాజానగరం మండలం జి.యర్రంపాలెం పరిధిలో భూపాలపట్నం-యర్రంపాలెం రోడ్డు పక్కన ఉన్న సిరా స్టూడియో స్పేస్ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాట్లు చేసుకున్నారు. దినేష్, పవన్ ఎండీఎంఏ డ్రగ్స్ కోసం గగన్ ద్వారా టెలిగ్రామ్ యాప్‌లో వచ్చే లింక్స్ ద్వారా డ్రగ్స్ విక్రేతల వివరాలు తెలుసుకుని వారి నుంచి రూ.32 వేలు విలువచేసే క్రిప్టో కరెన్సీ ద్వారా 4 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్‌ను ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసి డీటీడీసీ కొరియర్ ద్వారా ఢిల్లీ నుంచి తాడేపల్లిగూడెం తెప్పించుకున్నారు. దినేష్, గగన్ వాటిని తీసుకుని పుట్టినరోజు పార్టీలో పాల్గొన్నారు. అజయ్, పుష్పరాజ్ అన్నవరం రైల్వే స్టేషన్ సమీపంలో సాధువుల నుంచి సుమారు 50 గ్రాముల గంజాయి



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌చార్జి డీఎస్పీ దేవకుమార్, సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్

తెచ్చుకున్నారు. వీరంతా కలిసి కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఐదు రెడ్ లేబుల్ లిక్కర్ ఫుల్ బాటిల్స్ అక్రమంగా తెచ్చుకుని కారులో పార్టీ చేసుకుంటున్న తరుణంలో రాజానగరం పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారు సంఘటనా స్థలానికి చేరుకునే సరికి పవన్‌కుమార్ పరారయ్యాడు. మిగిలిన నలుగురినీ అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 4 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్, 50 గ్రాముల గంజాయి, కర్ణాటక రాష్ట్రానికి చెందిన 5 లిక్కర్ ఫుల్ బాటిల్స్, కారు స్వాధీనం చేసుకున్నారు. యువత మత్తు పదార్థాలకు అలవాటుపడి ఆరోగ్యం, జీవితాలను నాశనం చేసుకోవద్దని.. తల్లిదండ్రులు పిల్లలపై నిఘా ఉంచాలని డీఎస్పీ దేవకుమార్ విజ్ఞప్తి చేశారు.

మద్యం దుకాణాలకు విదేశాల నుంచీ దరఖాస్తులు

- తునిలో యూఎస్ నుంచి 20 అప్లికేషన్లు
- ఉమ్మడి తూర్పు గోదావరిలో 13వేల దరఖాస్తులు వచ్చే అవకాశం
- ఎక్సైజ్ డిప్యూటీ కమిషనరు చైతన్య మురళి



పిఠాపురం ఎక్సైజ్ స్టేషన్‌లో ఆఫ్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనరు చైతన్య మురళి

పిఠాపురం, అక్టోబరు 10: మద్యం దుకాణాల కోసం విదేశాల నుంచి కూడా దరఖాస్తులు చేస్తున్నారని, తునిలో యూఎస్ నుంచి ఇరవైకి పైగా అప్లికేషన్లు వచ్చాయని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనరు వై.చైతన్యమురళి తెలిపారు. కాకినాడ జిల్లా పిఠాపురంలోని ఎక్సైజ్ స్టేషన్‌లో ఆఫ్‌లైన్‌లో మద్యం దుకాణాల కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 413 మద్యం దుకాణాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నామని డీసీ చెప్పారు. అమెరికా, యూరప్ దేశాలు నుంచి దరఖాస్తులు వస్తున్నాయని తెలిపారు. దరఖాస్తులు వేయకుండా ఒత్తిడి తెస్తున్నారని, బెదిరింపులకు పాల్పడుతున్నారనే ఫిర్యాదులకు తావులేకుండా అత్యంత పారదర్శకంగా ప్రక్రియ నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. ఆఫ్‌లైన్‌లో లేదా ఆన్‌లైన్‌లో లేదా హైబ్రిడ్ మోడ్‌లో ఎక్కడి మద్యం దుకాణాల కోసమైనా దరఖాస్తు చేసుకోవచ్చునని, ఆఫ్‌లైన్‌లో ఎక్కడైనా దరఖాస్తు ఇవ్వవచ్చునని తెలిపారు. దరఖాస్తుల గడువు ముగిసే సమయానికి 13వేల దరఖాస్తులకు పైగా వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నామని చెప్పారు. లాటరీ ప్రక్రియను పారదర్శకంగా చేపడతామని తెలిపారు. అక్రమ మద్యం విక్రయాలు జరగకుండా అన్ని చర్యలూ తీసుకున్నామని, బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. ప్రస్తుతం దుకాణాల లాటరీ ప్రక్రియ ముగిసిన తర్వాత బీసీ వర్గానికి కేటాయించిన దుకాణాల కోసం నోటిఫికేషన్ ఇస్తామని తెలిపారు. డీసీ వెంట అసిస్టెంట్ కమిషనరు రేణుక, ఏఈఎస్ మౌనిక, ఎక్సైజ్ సీఐ శివరామరాజు ఉన్నారు.

జనజీవన స్రవంతిలోకి...

చింతూరు పోలీసుల ఎదుట లొంగిపోయిన ఇద్దరు మావోయిస్టు దళ సభ్యులు

చింతూరు, అక్టోబరు 10: ఛత్తీస్‌గఢ్‌కు చెందిన మావోయిస్టు దళ సభ్యులు ఇద్దరు గురువారం అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు పోలీసుల ఎదుట లొంగిపోయారు. వారికి దుస్తులు, మిఠాయిలు అందించి శాలువాలతో సన్మానించి పోలీసులు జనజీవన స్రవంతిలోకి ఆహ్వానించారు. చింతూరు ఏఎస్పీ పంకజ్‌కుమార్‌మీనా తెలిపిన వివరాలు ఇలా వున్నాయి... ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా కిష్టారం ఏరియా కమిటి 8 ప్లటూన్ సభ్యుడు ముచ్చిక ఐత, కుంట ఏరియా కమిటీ ఎల్‌వోఎస్ పార్టీ సభ్యురాలు మడకం హింగి లొంగిపోయారు. వీరిద్దరూ ఛత్తీస్‌గఢ్‌లో పలు విధ్వంసకర ఘటనల్లో పాల్గొన్నారు. కొన్నేళ్లుగా మావోయిస్టు పార్టీలో చురుకుగా వ్యవహరించిన వీరు చివరకు పార్టీ సిద్ధాంతాలతో విసుగు చెందారు. గిరిజనులపై గిరిజనేతర మావోయిస్టులు చూపుతున్న వివక్ష కూడా వీరిని కలచి వేసింది. మరోవైపు పార్టీలో పెద్ద నాయకులుగా వ్యవహరిస్తున్న కొందరు వీరితో చాకిరీ చేయించిన సందర్భాలు కూడా ఉన్నాయి. నిరంతర కూంబింగ్‌లు, పోలీసు నిఘా పెరగడంతో భయాందోళనకు గురయ్యారు. మరోవైపు ఆంధ్ర పోలీసులు చేపట్టిన సరెండర్, పునరావాస విధానం తెలుసుకుని పునరాలోచించుకుని పోలీసుల ఎదుట లొంగిపోయారు. ప్రభుత్వం కల్పించే సదుపాయాలు అందేలా చొరవ తీసుకుంటామని, ఇంకా అడవుల్లో తిరుగుతున్న మావోయిస్టులు కూడా లొంగిపోయి ప్రభుత్వ సహకారంతో ప్రజా జీవనం సాగించాలని ఏఎస్పీ కోరారు. విలేకరుల సమావేశంలో 42 బెటాలియన్ సి-కంపెనీ సీఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కేఎస్ మాథ్యు, చింతూరు సీఐ దుర్గాప్రసాద్, ఎస్‌ఐ పి.రమేష్ పాల్గొన్నారు.



మావోయిస్టు హింగికి పండ్లు, మిఠాయిలు అందజేస్తున్న ఏఎస్పీ పంకజ్‌కుమార్‌మీనా

ఈ గ్రామానికి ఏమైంది!



- వరుస మరణాలతో బెంబేలెత్తిపోతున్న ఎటపాక గ్రామస్తులు
- కారణాలు లేకుండా ఆత్మహత్య చేసుకుంటున్న వైనం
- రెండు నెలల వ్యవధిలో సుమారు 30 మంది వరకు మృతి
- గ్రామానికి కీడు జరిగినట్టు భావిస్తున్న స్థానికులు

ఎటపాక, అక్టోబరు 10: అల్లూరి సీతారామరాజు జిల్లాలో మండల కేంద్రమైన ఎటపాక గ్రామానికి ఏమైందో తెలియదు. ఇక్కడ రెండు నెలలుగా మరణ మృదంగం మోగుతోంది. ప్రతి వీధిలోనూ చావుడప్పు వినిపిస్తోంది. రెండు, మూడు రోజులకొకసారి ఎవరో ఒకరు శవమైపోతున్నారు. అప్పటికప్పుడే అనారోగ్యంపాలై వెంటనే మృత్యువాతపడుతున్నారు. ఎటువంటి కారణాలు లేకుండానే ఆత్మహత్య చేసుకుంటున్నారు. మధ్య వయసు గల వారు కూడా హఠాన్మరణం చెందుతున్నారు. రాయపుడి ఆదిత్య ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొర్రి నర్సింహమూర్తి అనారోగ్యంతో చనిపోయాడు. గోసుల చిన్న సత్యం అనారోగ్యంతో మృతి చెందాడు. ఇలా వరస మరణాలతో గ్రామస్తులు వణికిపోతున్నారు. రెండు నెలల వ్యవధిలో సుమారు 30 మంది వరకు మృతి చెందినట్టు తెలుస్తోంది. దీంతో ఊరికి ఏమైందోనని, ఏ అరిష్టం పట్టిందోనని ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గ్రామంలో ప్రతిష్ఠించుకున్న దేవతకు పూజలు చేయనందునే అరిష్టం వాటిల్లి కీడు జరిగినట్టు ప్రచారం జరుగుతోంది. చేతబడుల వల్ల కూడా చనిపోతున్నారనే ప్రచారంలో ఉంది. గ్రామ పెద్దలు జోక్యం చేసుకుని ప్రజలను చైతన్యవంతం చేసి పుకార్లను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



మంత్రి దుర్గేష్‌ను ఆహ్వానిస్తున్న అభిషిక్త్ కిషోర్

నారీశక్తి ఉత్సవాలకు విచ్చేయండి

మంత్రి దుర్గేష్‌కు పర్యాటక శాఖ ఎండీ అభిషిక్త్ కిషోర్ ఆహ్వానం

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 10: దసరా శరన్నవరాత్రుల సందర్భంగా విజయవాడ పున్నమి ఘాట్ సమీపంలోని బబ్బూరి గ్రౌండ్‌లో ఈ నెల 11, 12, 13 తేదీల్లో నిర్వహించే నారీశక్తి ఉత్సవాల్లో పాల్గొనాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను ఆ శాఖ ఎండీ అభిషిక్త్ కిషోర్ ఆహ్వానించారు. గురువారం ఆయన మంత్రిని వెలగపూడి సచివాలయంలోని చాంబర్‌లో కలిశారు. నవదుర్గలు ప్రతిబింబించేలా మహా హారతి, జానపద నృత్యాలు, కోలాటం, డప్పు, తప్పెటగుళ్లు, తెలంగాణ బోనాలు వంటి కళా ప్రదర్శనలు, హస్తకళా ప్రదర్శనలతో పాటు జాతీయ, అంతర్జాతీయ రుచులతో ఫుడ్ ఫెస్టివల్, బొమ్మలకొలువు, దసరా ఉత్సవాలు, కనకదుర్గమ్మ చరిత్రను వివరించేలా డ్రోన్‌షో ఏర్పాటు చేశామని మంత్రికి వివరించారు. ఇందులో పాల్గొని అమూల్యమైన సందేశం ఇవ్వాలని మంత్రిని అభిషిక్త్ కిషోర్ కోరారు.

దుర్గాదేవిగా రత్నగిరి వనదుర్గ



అన్నవరం, అక్టోబరు 10: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రత్నగిరి క్షేత్ర రక్షకిలైన వనదుర్గ, కనకదుర్గ గురువారం దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. దుష్ట శిక్షణ, శిష్ట సంరక్షణార్థం అవతరించిన అమ్మగా భక్తులను అనుగ్రహించారు. దుర్గాష్టమి సందర్భంగా ఆలయంలో వివిధ పూజలు, సాయంత్రం లక్ష కుంకుమార్చన నిర్వహించారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్ల రాకల్లో స్వల్ప మార్పులు

సామర్లకోట, అక్టోబరు 10: కాకినాడ జిల్లా సామర్లకోట మీదుగా విజయవాడ నుంచి విశాఖకు చేరుకునే 14 ఎక్స్‌ప్రెస్ రైళ్ల రాక సమయాల్లో ఈ నెల 15, 18, 19, 20, 22 తేదీల్లో ఐదు రోజులు స్వల్ప మార్పులు చేసినట్టు రైల్వే ఉన్నతాధికారులు సామర్లకోట రైల్వే స్టేషన్‌కు సమాచారం అందించారు. కడియం, రాజమహేంద్రవరం, గోదావరి, కొవ్వూరు సెక్షన్లలో సిగ్నలింగ్ వ్యవస్థ మరింత ఆధునికీకరిస్తున్నందున ఇప్పటికే అమలులో ఉన్న సమయాల్లో 5 నుంచి 10 నిమిషాలు వెనక్కి మార్పు చేసినందున ప్రయాణికులు గమనించాలని సూచించారు.

సికింద్రాబాద్-కాకినాడ మధ్య దసరా ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌లు

సామర్లకోట, అక్టోబరు 10:

దసరా పండుగ సందర్భంగా కాకినాడ-సికింద్రాబాద్ మధ్య ఈ నెల 12న, సికింద్రాబాద్-కాకినాడ మధ్య ఈ నెల 11న ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ నడుపుతున్నట్టు రైల్వే సీజీటీఎం రాజనర్సు ఆదేశాలు జారీ చేశారు. 20 అధునాతన ఎల్‌హెచ్‌బీ బోగీలతో ఈ రైళ్లు రాకపోకలు సాగిస్తాయి.

కాకినాడ-సికింద్రాబాద్ (07071) 12వ రాత్రి 9 గంటలకు కాకినాడలో బయల్దేరుతుంది. రాత్రి 9.22 గంటలకు సామర్లకోట, 10.12 గంటలకు రాజమహేంద్రవరం, అక్కడి నుంచి నిడదవోలు, తణుకు, భీమవరం, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, కృష్ణా కెనాల్, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ళ, నల్గొండ, పగిడిపల్లిల మీదుగా ఉదయం 8.30 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది.

సికింద్రాబాద్-కాకినాడ (07072) 12వ తేదీ సాయంత్రం 6.15 గంటలకు సికింద్రాబాద్‌లో బయల్దేరుతుంది. పగిడిపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ళ, సత్తెనపల్లి, గుంటూరు, కృష్ణా కెనాల్, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం, తణుకు, నిడదవోలు మీదుగా తెల్లవారుజామున 5.15 గంటలకు రాజమహేంద్రవరం, 6.15 గంటలకు సామర్లకోట, కాకినాడ టౌన్‌కు 7.30 గంటలకు చేరుకుంటుంది.

ఏజెన్సీ సమాచారం

డీజిల్ ఇంజన్ల అవసరాన్ని గుర్తించండి

వ్యవసాయ అధికారులకు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ ఆదేశం


సిల్క్ పంటను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో

చింతూరు, అక్టోబరు 10: చింతూరు డివిజన్ పరిధిలోని ఎంత మంది రైతులకు డీజిల్ ఇంజన్లు అవసరమో వివరాలు సేకరించాలని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ వ్యవసాయాధికారులను ఆదేశించారు. ఆంధ్ర-ఒడిశా మధ్య 326 జాతీయ రహదారి విస్తరణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. కుయుగూరులో సాగు చేస్తున్న మిర్చి పంటను కూడా చూశారు. తమకు డీజిల్ ఇంజన్లు సమకూర్చాలని రైతులు పీవోని కోరారు. దీనికి స్పందించిన ఆయన వివరాలు సేకరించాలని కోరారు. ఎర్రగొండపాకలలో టసర్ సిల్కు సాగును పరి శీలించి రైతులతో మాట్లాడారు. చింతూరు డివిజన్‌లో టసర్ సిల్కు ఉత్పత్తి పెంచే దిశగా ప్రణాళిక సిద్ధం చేయాలని సెరికల్చర్ అధికారులను ఆదేశించారు. తులసిపాకల ప్రాథమిక వైద్యశాలను సందర్శించి చికిత్స పొందుతున్న వారితో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. పీహెచ్‌సీ ప్రహరీ నిర్మాణానికి అంచనాలు తయారు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పర్య టనలో డీఎఫ్‌వో బబిత, హైవే ఏఈ చక్రవర్తి, హార్టికల్చర్ అధికారి కోల ముత్తయ్య పాల్గొన్నారు.

'మెరుగైన వైద్య సేవలందించాలి'



రంపచోడవరం, అక్టోబరు 10: పీహెచ్‌సీలకు వచ్చే రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మెరుగైన సేవలందించాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం ఆయన పెద గెద్దాడ పీహెచ్‌సీని పరిశీలించారు. పీహెచ్‌సీ పరిధిలో గర్భిణులు ఎంతమంది, నమోదైన మలేరియా కేసుల వివరాలు, అందిస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు. వైద్యాధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు.

దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు

మోతుగూడెం, అక్టోబరు 10: స్థానిక శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గాష్టమి సందర్భంగా ప్రధానార్చకుడు పవన్ ఆధ్వర్యంలో చండీ హోమం నిర్వహించారు. యూనియన్ బ్యాంకు మేనేజరు విత్తనాల సత్యనారాయణ దంపతులు ముఖ్య అతిథిగా హాజరు కాగా ఏపీ జెన్‌కో ఉద్యోగి చంద్రశేఖర్ దంపతులు, గ్రామస్థులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దేవీపట్నం: మండలంలోని ఇందుకూరుపేట దుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

విలేకరిపై దాడి చేసిన వైసీపీ నాయకులపై కేసు

కూనవరం, అక్టోబరు 10: ఓ ఆశా వర్కర్‌పై తప్పుడు వార్త రాశారంటూ పోలిపాకకు చెందిన వైసీపీ కార్యకర్తలు అదే గ్రామానికి చెందిన ఓ పత్రికా విలేకరిపై దాడి చేశారు. వారిపై కూనవరం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ శ్రీనివాస్ దర్యాప్తు నిర్వహించి దాడి చేసిన వారిపై కేసు నమోదు చేశారు.

తహశీల్దార్లకు సన్మానం



కూనవరం, అక్టోబరు 10: కూనవరం బదిలీపై వచ్చిన తహశీల్దారు శ్రీనివాస్, ఇక్కడి నుంచి బదిలీపై వెళ్తున్న తహసీల్దారు నాగబాబులను గురువారం టీడీపీ, జనసేన నాయకులు సన్మానించారు. టీడీపీ అరకు పార్లమెంటు ప్రతినిధి ఎడవిల్లి భాస్కరరావు మాట్లాడుతూ నాగబాబు గోదావరి వరదల్లో అనేక విధాలుగా సేవలు చేశారని, శ్రీనివాస్ కూడా సేవలందించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పొడియం అప్పారావు, బరపాటి ప్రకాశ్, గడేసుల ప్రేమ్‌చంద్, చెలకాని ఉమామహేశ్వరరావు, జనసేన మండలాధ్యక్షుడు దాసరి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ పెంపకంపై రైతులకు అవగాహన

వై.రామవరం, అక్టోబరు 10: మండలంలోని పి.యర్రగొండ పంచాయతీ వంక బూసి గ్రామంలో పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ ప్రతినిధులు గురువారం పామాయిల్ రైతులకు అవగాహన కల్పించారు. దుర్గాప్రసాద్, చక్రబాబు, సూపర్‌వైజర్ రాంబాబు యాజమాన్య పద్ధతులు, అధిక దిగుబడులు సాధించడంలో మెళకువలు నేర్పారు. ఆదర్శ రైతులు పల్లాల వెంకటరమణరెడ్డి, కలిమెల బాబూరావు, మాజీ సర్పంచ్ జమ్మల నీలంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

వరరామచంద్రాపురం, అక్టోబరు 10: స్థానిక వీడియో బజారులోని ఉత్సవ మండపం ఆవరణలో ఉత్సవ కమిటీ సభ్యులు గురువారం మహా అన్నసమారాధన నిర్వహించారు. సుమారు వెయ్యి మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. అప్పాజీ, ఉప్పనపల్లి సాయి, మధు, కడుపు సాయి, పల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముంపు గ్రామాల్లో 68 టేకు చెట్లు మాయం!

దేవీపట్నం, అక్టోబరు 10: పోలవరం ప్రాజెక్టులో ముంపునకు గురైన దేవీపట్నం మండల గ్రామాల్లో కొంతమంది స్మగ్లర్లు టేకు చెట్లను నరికి తరలించుకుపోయిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సుమారు 68 టేకు చెట్లు మాయమైనట్లు తెలుస్తోంది. అధికారులు స్పందించి స్మగ్లర్లపై చర్యలు తీసుకోవాలని, టేకు చెట్లను స్వాధీనం చేసుకోవాలని నిర్వాసితులు కోరుతున్నారు.

18 మద్యం షాపులకు 506 దరఖాస్తులు

రంపచోడవరం, అక్టోబరు 10: అల్లూరి సీతారామరాజు జిల్లాలోని రంపచోడవరం మన్యంలో 18 మద్యం షాపులకు 506, పాడేరు డివిజన్లో 22 షాపులకు 327 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 40 షాపులకు 833 దరఖాస్తుల ద్వారా రూ.16.66 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి వచ్చింది. గురువారం సాయంత్రం వరకు అందిన సమాచారం ప్రకారం.. రంపచోడవరం, చింతూరు డివిజన్లలోని 18 షాపులకు 506 దరఖాస్తులు రాగా రూ.10.12 కోట్ల ఆదాయం వచ్చింది. వీటిలో అత్యధికంగా ఎటపాకలోని షాపు నెం.36 కోసం 57, షాపు నెం.37 కోసం 57 దరఖాస్తులు వచ్చాయి. శుక్రవారం గడువు ముగుస్తుండడంతో మరిన్ని దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

అమ్మవారికి బోనాల సమర్పణ

వై.రామవరం, అక్టోబరు 10: పి.యర్రగొండలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు బోనాలు సమర్పించారు. వై.రామవరం వరకు అమ్మవారిని ఊరేగించి గరగ నృత్యాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన బతుకమ్మ సంబరాలు

ఎటపాక, అక్టోబరు 10: బతుకమ్మ సంబరాలు గురువారం ముగిశాయి. మహిళలు, యువతులు, బాలికలు వివిధ రకాల పూలతో బతుకమ్మలను ఏర్పాటు చేసి తొమ్మిది రోజులపాటు ఆటపాటలతో సందడి చేశారు. గన్నవరం, తోటపల్లి, సీతాపురం, నందిగామ, నెల్లిపాక, చోడవరంల్లో సంబరాలు జరుపుకున్నారు. చివరి రోజున సద్దుల బతుకమ్మ ఏర్పాటు చేసి ఆటపాటలతో ముగించారు.

ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం

రంపచోడవరం, అక్టోబరు 10: ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఉమా ఎడ్యుకేషనల్, టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఏరియా ఆసుపత్రిలో మానసిక రోగులకు ప్రత్యేక వైద్యాధికారిని నియమించాలని, సదరం సర్టిఫికెట్లు పొందేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందజేశారు. దివ్యాంగులకు చెక్కులు పంపిణీ చేశారు. సీబీఆర్ సిబ్బంది ఎస్.దొరబాబు, ఎం.సత్తిబాబు, కె.వరలక్ష్మి, జె.సంజీవరాణి, ఎం.లూథియారాణి, కె.కమలకుమారి పాల్గొన్నారు.

పొగరాని పొయ్యిల పంపిణీ

రంపచోడవరం, అక్టోబరు 10: దిరిసినపల్లిలో క్రాప్ జోన్ స్వచ్ఛంద సంస్థ ద్వారా 100 కుటుంబాలకు పొగరాని పొయ్యిలను టీడీపీ మండలాధ్యక్షుడు కారం సురేష్‌బాబు పంపిణీ చేశారు. జనసేన నాయకులు కోడె రవిబాబు, రాగాల సురేష్, వార్డు సభ్యులు మడి బుల్లమ్మ, కోసు నాగన్నదొర, మడి కాంతమ్మ, తాటి రామయమ్మ, కోసు లక్ష్మి పాల్గొన్నారు.

రేషన్‌షాపు పునర్విభజనలో న్యాయం చేయాలి

దివాన్‌చెరువు, అక్టోబరు 10: తనకు గతంలో కేటాయించిన రేషన్‌షాపు పునర్విభజన చేస్తున్నట్టు తెలిసిందని, తనకు న్యాయం చేయాలని రాజానగరం మండలం జి.ఎర్రంపాలెం గ్రామానికి చెందిన దివ్యాంగుడు పెదపాటి గోపాలకృష్ణ కోరాడని ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్ గురువారం తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి సహేతుక విధానంలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గోపాలకృష్ణకు వద్దకు ఆర్డీవో వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

కరుణించు.. కనకదుర్గమ్మ

- దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు
- దేవిచౌక్‌లో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు దంపతుల పూజలు


రాజమహేంద్రవరంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, భవాని దంపతులు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 10: రాజమహేంద్రవరం దేవిచౌక్‌లో శ్రీబాలాత్రిపుర సుందరీదేవి అమ్మవారు శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆలయ కమిటీ వైభవోపేతంగా నిర్వహిస్తోంది. ఎనిమిదో రోజైన గురువారం అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, భవాని దంపతులు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, వీరరాఘవమ్మ దంపతులు, వాసు తనయుడు జయేష్ నాయుడు లు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గురువారం ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. రాత్రి 10గంటలకు భూకైలాస్ నాటక ప్రదర్శన జరిగింది.

దుర్గాదేవి అవతారంలో గద్దెలో అమ్మవారు

గోకవరం, అక్టోబరు 10: గోకవరంలోని వీరభద్రుడి గద్దెలోని కనకదుర్గమ్మ ఆలయంలో శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం అమ్మవారు దుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామానికి చెందిన విసమ్‌శెట్టి లక్ష్మణ్ దంపతులతో అర్చకులు దుర్గాహోమం నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు.

దుర్గమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే నల్లమిల్లి దంపతులు

అనపర్తి, అక్టోబరు 10: శరన్నవ రాత్రుల సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు గురువారం విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారికి ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటాన్ని, వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంట బీజేపీ నాయకుడు కర్రి బులిరెడ్డి, పడాల వెంకటసాంబశివారెడ్డి తదితరులున్నారు.


ఎమ్మెల్యే నల్లమిల్లి దంపతులకు అమ్మవారి చిత్రపటం బహూకరిస్తున్న దృశ్యం


గద్దెలో అమ్మవారు

దివాన్‌చెరువులో కలశయాత్ర

దివాన్‌చెరువు, అక్టోబరు 10: దివాన్‌చెరువులో భవానీ మాలధారులు గురువారం కలశయాత్ర నిర్వహించారు. దీంతో గ్రామం దుర్గమ్మ నామస్మరణతో మార్మోగింది.. స్థానిక సాధుపేటలో మహాగణపతి యువజన సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ కనకదుర్గమ్మ 13వ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గాష్టమి సందర్భంగా గురు భవానీ పంచికట్ల దుర్గారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ యాత్ర గ్రామంలోని పలు వీధులు, ప్రధాన రహదారి మీదుగా సాగింది. కార్యక్రమంలో భవానీ భక్తులు చింతా సత్తిబాబు, పలివెల నవీన్, పబ్బిరెడ్డి నాగన్న, చింతా దేవీశ్రీప్రసాద్, నీలపాల శివ, పలివెల ఉమామహేష్, తరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక రాంబాబు డాక్టరు ఇంటి వద్ద శ్రీవిశ్వేశ్వరీదేవి ఆలయ ప్రాంగణంలో బుధవారం రాత్రి బొమ్మూరులోని శ్రీకర్ నృత్య నికేతన్‌కు చెందిన నాట్యగురువు రాజరాజేశ్వరీ దేవి శిష్య బృందం ప్రదర్శించిన నృత్యాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే బత్తుల


సూర్యారావుపేటలో అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం/కోరుకొండ, అక్టోబరు 10: దసరా ఉత్సవాల్లో భాగంగా పలు గ్రామాల్లో ప్రత్యేక మండపాల్లో కొలువుదీరిన దుర్గామాతలను ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డు వెంకటరమణ చౌదరితో పాటు పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. సూర్యారావుపేట, బొల్లేద్దుపాలెంలో ఎమ్మెల్యే బత్తుల, సతీమణి వెంకటలక్ష్మి, కుమార్తె వందనాంబిక అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే సీతారాంపురంలో జరిగిన భవానీ పడిపూజలో బత్తుల పాల్గొన్నారు. కోరుకొండ, జంబుపట్నం, బూరుగుపూడి, గాడాల, నర్సాపురం గ్రామాల్లో జరుగుతున్న దసరా ఉత్సవాల్లో ఎమ్మెల్యే దంపతులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమాల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగిశెట్టి చంటిబాబు, నూనె వెంకన్న, దాకారపు బూరయ్య, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రిపై భక్తులకు మొక్కలు అందజేత



కడియం, అక్టోబరు 10: విజయవాడ ఇంద్రకీలాద్రిపై శ్రీదేవీ శరన్నవరాత్రులు సందర్భంగా భక్తులకు బుర్రిలంక గ్రామానికి చెందిన ఈశ్వరా ఫామ్స్ నర్సరీ అధినేత, టీవీసీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తాడాల విష్ణుచక్రవర్తి, ఆయన కుటుంబసభ్యులు భక్తులకు మొక్కలు పంపిణీ చేశారు. దేవదాయ ఈవో, డిప్యూటీ కలెక్టర్ కేఎస్ రామారావు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రీతిపాత్రమైన కదంబం, తులసి, ఉసిరి, మారేడు, జమ్మి, నేరేడు వంటి పది వేల మొక్కలను భక్తులకు అందజేశామన్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులతోపాటు తాడాల రాజేశ్వరి, కృష్ణకుమార్, సత్య, అర్జునరావు, దుర్గాభవానీ, లక్ష్మీనారాయణ, శ్రీలక్ష్మి తదితరులున్నారు.

రూ.10 లక్షలతో మేకల కబేళా ఆధునీకరణ


కబేళాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 10: రాజమహేంద్రవరం ఆవరోడ్డులో ఉన్న మేకల కబేళాను రూ.10 లక్షలతో అభివృద్ధి చేశారు. దానిని గురువారం సాయంత్రం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆవ రోడులోని కబేళాను రూ.10 లక్షలతో ఆధునీకరించామన్నారు. భవాని చారిటబుల్ ట్రస్టు సాయంతో రూ.5 లక్షలతో ఏర్పాటు చేసిన జనరేటర్, రూ.3 లక్షలతో నిర్మించిన స్లాట్స్ కట్టింగ్ మిషన్‌ను ఆయన ప్రారంభించారు. రాజకీయాలకు వ్యాపారాలకు ముడిపెట్టవద్దని వ్యాపారస్తులు వారి వ్యాపారాలను వృద్ధి చేసుకోవాలన్నారు. నగరపాలక సంస్థ కబేళా ఆధునీకరణకు ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీ వేసిందని, వీరు రాష్ట్రంలో ఏయే ప్రాంతాల్లో స్లాట్ హౌస్ బాగా నడుస్తున్నాయో అక్కడికి వెళ్లి అక్కడ అమలు జరుగుతున్న ప్రక్రియను మునిసిపల్ కార్పొరేషన్‌కు చెప్పడం ద్వారా ఇక్కడ స్లాట్ హౌస్ నిర్మాణం జరిగిందని చెప్పారు.

రతన్ టాటా మృతికి సంతాపం

రతన్ టాటా మృతి పట్ల ఎమ్మెల్యే వాసు తన ప్రగాఢ సంతాపం ప్రకటించారు. దేశంలో అనేక సేవ కార్యక్రమాలు చేయడంతో పాటు కరోనా సమయంలో ఆయన చేసిన దాతృత్వం మరువలేమన్నారు. దేశీయ మార్కెట్‌లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావడంతోపాటు సేవల్లో ముందున్నారని గుర్తు చేశారు. దేశ ప్రజల హృదయాల్లో రతన్‌టాటా చిరస్థాయిగా నిలుస్తారన్నారు.

నిరాశ్రయుల దినోత్సవ ర్యాలీ

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 10: ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవ ర్యాలీని రాజమహేంద్రవరంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. గురువారం స్థానిక కంబాలచెరువు వద్ద పట్టణ నిరాశ్రయుల కేంద్రం నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర నిర్వాహకుడు గుబ్బల రాంబాబు మాట్లాడుతూ నిరాశ్రయులకు సౌకర్యాలను మెరుగుపర్చాలన్నారు. నగరంలో సుమారు 5వేల మంది నిరాశ్రయులున్నారని, వివిధ పనులు, అవసరాల రీత్యా నగరానికి రావడం ఉపాధి, ఉద్యోగవకాశాలు లేక నిరాశ్రయులుగా రోడ్డున పడుతున్నారన్నారు. అనంతరం నిరాశ్రయుల కేంద్రంలో కార్పొరేషన్ రిటైర్డ్ ఎంహెచ్‌వో డాక్టర్ ఎంవీఆర్ మూర్తి, పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు.

అయ్యప్పస్వామి ఆలయంలో అన్నదానం

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబర్ 10: స్థానిక గౌతమి ఘాట్‌లోని అయ్యప్పస్వామి ఆలయంలో విజయదశమి నుంచి అయ్యప్పస్వామి భక్తులకు అన్నదానం నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్టు శ్రీ ధర్మశాస్త్ర ఆధ్యాత్మిక సంస్థ ధర్మకర్తలు జక్కంపూడి విజయలక్ష్మి, చల్లా శంకరరావు, పోలసానపల్లి హనుమంతరావు తెలిపారు. అయ్యప్ప మాలధారులకే కాకుండా, భవాని, శివ మాలధారులకు భోజనం అందిస్తామన్నారు. శంకరరావు మాట్లాడుతూ దాతల సహకారంతో రూ.1.15 కోట్ల విరాళాలను సంస్థ తరఫున డిపాజిట్ చేశామని, భవిష్యత్తులో దానిపై వడ్డీతో అన్నదానం కొనసాగించవచ్చని చెప్పారు. అన్నదానం కోసం లక్ష్మీసాయినాథ్ ఎంటర్‌ప్రైజెస్ అధినేత చాపరాల రామచంద్రరావు పేరిట ఆయన కుటుంబీకులు రూ.65 వేలు విరాళాన్ని అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో మంతెన కేశవరాజు, తోట సుబ్బారావు, ఇమంది మోహనరావు, దవులూరి రామకృష్ణ, చలపతి గురుస్వామి పాల్గొన్నారు.

కోతులు, కుక్కల నిర్మూలనకు చర్యలు చేపట్టాలి


వినతిపత్రం అందజేస్తున్న బోస్

గోకవరం, అక్టోబరు 10: గోకవరంలో కోతులు, కుక్కల నిర్మూలనకు చర్యలు చేపట్టాలంటూ అధికారులకు మాజీ జడ్పీటీసీ పాలూరి బోస్, స్థానికులు వినతిపత్రం అందజేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో గోవిందు, పంచాయతీ కార్యదర్శి శిరీషలను గురువారం వారు కలిసి కోతులు, కుక్కలు వల్ల ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. కొంతకాలంగా కోతులు, కుక్కల బారిన పడి అనేకమంది గాయాల పాలయ్యారని, మరికొందరు ప్రాణాల మీదకు తెచ్చుకున్నారని వాపోయారు. పొలాల్లోని పంటను కోతులు పాడుచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం వల్ల వాటి నివారణ సాధ్యం కాలేదని, ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

బాణసంచా తయారీకి లైసెన్సులు తప్పనిసరి


బాణసంచా తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బిక్కవోలు, అక్టోబరు 10: లైసెన్సులు లేకుండా బాణసంచా తయారు చేస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ సుమంత్ హెచ్చరించారు. గురువారం ఆయన మండలంలోని కొమరిపాలెం, తొస్సిపూడి గ్రామాల్లో బాణసంచా తయారీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిమితులకు మించి బాణసంచా తయారుచేస్తే సీజ్ చేస్తామన్నారు. ప్రమాదాలు జరగకుండా అగ్ని నిరోధక యంత్రాలు, నీటి నిల్వలు అందుబాటులో వుంచుకోవాలన్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తయారీదారులకు సూచించారు. సీఐ వెంట ఎస్ఐ వి.రవిచంద్రకుమార్, సిబ్బంది ఉన్నారు.

కుతుకులూరులో ఉచిత నేత్ర వైద్య శిబిరం

అనపర్తి, అక్టోబరు 10: కుతుకులూరు పంచాయతీ కార్యాలయంలో గురువారం పులగం సూర్రెడ్డి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పులగం తిరుమల రెడ్డి ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడి ప్రారంభించారు. ముందుగా సూర్రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. శిబిరంలో కపిలేశ్వరపురానికి చెందిన ఎల్‌వీ ప్రసాద్ ఆసుపత్రి వైద్యులు సేవలందించారు. 268మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 64మందికి శస్త్ర చికిత్స అవసరమని గుర్తించి వారిని కపిలేశ్వరపురం ఆసుపత్రికి తరలించామని తిరుమలరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గొల్లు హేమతులసి, రామవరం సర్పంచ్ గిరిడా గంగాభవాని, తమలంపూడి సుధాకరరెడ్డి, కర్రి చిన్నారెడ్డి, తమలంపూడి సూర్రెడ్డి, పడాల వెంకటసుబ్బారెడ్డి, తమలంపూడి రామారెడ్డి, పులగం శాంతి పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ల నిరసన

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 10: భారతీయ జీవిత బీమా సంస్థ సీఈవో తీరు ఏజెంట్లను మనోవేదనకు గురి చేస్తోందని ఎల్ఐసీ ఏజెంట్ల సంఘం రాజమహేంద్రవరం రూరల్ శాఖ అధ్యక్షుడు ఆదిమూలం సాయిబాబా అన్నారు. ఏజెంట్లు చేస్తున్న నిరసన కార్యక్రమం గురువారం నాలుగో రోజుకి చేరింది. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ ఇటీవల తనతో పాటు, లియాఫీ యూనియన్ డివిజన్ అధ్యక్షులు రావుల మాధవరావు, కార్యదర్శి మాలే నాగబాబు, యూనియన్ నాయకులు కలిసి ఏజెంట్లు సమస్యలపై రాజమహేంద్రవరం డివిజనల్ మేనేజర్ సంధ్యారాణికి వినతిపత్రం ఇచ్చామన్నారు. ఏజెంట్లకు కమీషన్ తగ్గింపు, పాలసీల్లో మార్పులు తీసుకురావడం, మొదటి ఏడాది పాలసీ సరెండర్ చేస్తే దానిలో ఏజెంట్లకు కమీషన్ కోత వంటి అంశాలు ఏజెంట్లు మనుగడకు కష్టమన్నారు. కార్యక్రమంలో ఏజెంట్లు జీకే చంద్రశేఖర్, రాయుడు గంగరావు, యర్నాగుల రామ్మోహనరావు, అమిరిశెట్టి ఏసు, అన్నందేవుల అన్నవరం, సత్యకామేష్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

కోరుకొండ, అక్టోబరు 10: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం మండల పరిషత్ ఉద్యోగులు, మహిళలకు సైబర్ నేరాలపై పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ సత్యకిషోర్, ఎస్ఐ శ్యామ్ సుందర్ పలు సైబర్ నేరాలను వివరించి, అలాంటివి జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నేరానికి గురైన తరువాత తీసుకోవాలని చర్యలు తెలిపారు. సైబర్ క్రైం బాధితులు టోల్‌ఫ్రీ నెంబరు1930 ఫోన్ చేయడం నిందితుల అకౌంట్ సీజ్ చేయడానికి అవకాశం ఉంటుందన్నారు.

మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం : డీఎస్పీ

రాజానగరం, అక్టోబరు 10: మాదక ద్రవ్యాల నిర్మూలనపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని రాజమహేంద్రవరం ఇన్‌చార్జ్ డీఎస్పీ జి.దేవకుమార్ అన్నారు. గురువారం రాజానగరం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ 100 రోజుల ప్రణాళిక అమల్లో భాగంగా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించిందన్నారు. అసాంఘిక కార్యకలాపాల నిర్మూలన, మాదక ద్రవ్యాల నియంత్రణపై కఠిన చర్యలు చేపడుతోందన్నారు. సీఐ ప్రసన్న వీరయ్యగౌడ్ మాట్లాడుతూ డ్రగ్స్ నియంత్రణపై ఇప్పటికే పలు కళాశాలల్లో అవగాహన సదస్సు లు ఏర్పాటు చేశామన్నారు.

సరస్వతి దేవాలయంలో కుంకుమ పూజ



రాజమహేంద్ర వరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానికంగా ప్రసిద్ధి చెందిన జ్ఞాన సరస్వతి పీఠం చైర్మన్, ఆర్ఎస్ఆర్ సంస్థల అధినేత రంగిరెడ్డి సుబ్బరాజు(ఆర్ ఎస్ఆర్) ఆధ్వర్యంలో గురువారం కుంకుమ పూజ చేశారు. అనంతరం 4 వేల మందికి అన్నదానం జరిపారు. సాయంత్రం అయ్యగారి సత్యవరప్రసాద్ వీణ కచేరి, ఉమా నృత్యశేతన్‌కు చెందిన రెడ్డి ఉమారాణి ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో పీఠం వ్యవస్థాపక మేనేజింగ్ ట్రస్టీ తోట సుబ్బారావు, ఆర్ఎస్ఆర్ ఎండీ రంకిరెడ్డి గోపాలకృష్ణ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రతన్ టాటా మృతి దేశానికి తీరని లోటు

ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి, అక్టోబరు 10: టాటా గ్రూప్ మాజీ చైర్మన్ రతన్ టాటా మృతి దేశానికే తీరని లోటని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం రామవరంలో ఏర్పాటు చేసిన రతన్ టాటా సంతాప సభలో ఆయన మాట్లాడుతూ భారతదేశం గర్వించదగ్గ వ్యాపారవేత్తల్లో రతన్ టాటా ప్రథమస్థానంలో నిలుస్తారని, పేదల కోసం కోట్లాది రూపాయలు వెచ్చించారన్నారు. కరోనా సమయంలో రూ.1500 కోట్ల విరాళం అందించి మానవత్వాన్ని చాటిన మహోన్నత వ్యక్తిని ఆయనను కోల్పోవడం దురదృష్టకరమని అన్నారు. కూటమి నాయకులతో కలిసి ఆయన సంతాపం ప్రకటించారు. కార్యక్రమంలో తమలంపూడి సుధాకరరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, కర్రి బులిరెడ్డి, తాడి గంగిరెడ్డి, హరినారాయణరెడ్డి, శ్రీదేవి పాల్గొన్నారు.

చర్చ్ నిర్మాణానికి ఎమ్మెల్యే గోరంట్ల ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 10: శాటిలైట్ సిటీ బాహుజీ నగర్‌లో నిర్మాణంలో ఉన్న జీసస్ పవర్ ప్రేయర్ హౌస్ చర్చ్‌కు ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి రూ.2 లక్షలు ఆర్థిక సాయం అందించా రు. గురువారం తన నివాసంలో ఈ సాయం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెనుకబడిన వర్గాలు ఉన్న గ్రామం శాటిలైట్ సిటీ అని, కులం, మతం అంటూ తేడా లేకుండా ఆగ్రామ వాసులంతా తన వెంటే నడిచారని వారందరికి వెన్నంటే ఉంటానని మాట ఇచ్చానని, ఆ ప్రకారం సహకారం అందిస్తున్నానన్నారు. కార్యక్రమంలో సింగు సురేంద్ర, పిన్నింటి రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఎన్నికలు జరపాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 10: రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలను వెంటనే నిర్వహించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం రాజమహేంద్రవరంలోని అపరాల సెక్షన్ కార్యాలయంలో జరిగిన సీపీఐ శాఖా సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. నగరంలో ప్రజాప్రతినిధులు లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వార్డుల్లో సమస్యలు పేరుకుపోయాయని, ప్రభుత్వం తక్షణమే మున్సిపల్ ఎన్నికలు జరిపించాలని కోరారు. సమావేశంలో జట్టు లేబర్ యూనియన్ అధ్యక్షులు కె.రాంబాబు, సీపీఐ, జట్టు లేబర్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

మానసిక రోగులపై మరింత దయ అవసరం

రాజమహేంద్రవరం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మానసిక రోగుల పట్ల మరింత దయతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్ బాబు పేర్కొన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గురువారం ప్రభుత్వాస్పత్రిలోని మానసిక చికిత్సా కేంద్రాన్ని, వన్‌స్టాప్ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఆయా విభాగాల్లో రోగులకు అందుతున్న వైద్యం, సదుపాయాలను పరిశీలించారు. మానసిక రోగులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితులను ఆరా తీశారు. వైద్యుల సూచనలు పాటిస్తూ తగు జాగ్రత్తలు తీసుకుంటే త్వరగా కోలుకోవచ్చని హితవు పలికారు. మానసిక రుగ్మతల నుంచి రోగులు పూర్తిగా ఉపశమనం పొందిన తర్వాత వారిని కుటుంబ సభ్యులతో కలపడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ విషయంలో డీఎల్ఎస్ఏ ద్వారా సహకారం అందిస్తామన్నారు. మానసిక రోగులకు అందిస్తున్న వైద్యం, సేవలను ఆస్పత్రి పర్యవేక్షకురాలు డాక్టర్ ఎం.లక్ష్మీ సూర్యప్రభ వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్‌ను పరిశీలించిన గన్ని కృష్ణ

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 10: రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్, జీఎస్ఆర్ ఫౌండేషన్ బ్లడ్ బ్యాంక్‌ను గురువారం టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ పరిశీలించారు. ఆయనకు బ్లడ్ బ్యాంక్ వివరాలను నిర్వాహకుడు డాక్టర్ గోరంట్ల రవిరామ్ కిరణ్ తెలిపారు.

మానవ అక్రమ రవాణా నివారణపై అవగాహన

పెరవలి, అక్టోబరు 10: మానవ అక్రమ రవాణాను నిరోధించడం అందరి బాధ్యత అని పెరవలి సీడీపీవో శ్రీలక్ష్మి అన్నారు. ప్రజ్వలన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణాపై సీడీపీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి, ప్రజ్వలన అసిస్టెంట్ కోఆర్డినేటర్ శివ కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో శివ, సుప్రియ, అనిల్, భాగ్యలక్ష్మి, బాల సరస్వతి పాల్గొన్నారు.



వ్యాపారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి

ఏఎంసీ అభివృద్ధికి చర్యలు

కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు అక్టోబరు 10: వ్యవసాయ మార్కెట్ కమిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దనున్నట్టు కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయాన్ని గురువారం ద్విసభ్య కమిటీ ఆధ్వర్యంలో ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రావడంతోనే మార్కెట్ కమిటీ పాలకవర్గాల నియామకాన్ని చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు ఇచ్చారన్నారు. త్వరలోనే కమిటీలు వేస్తామన్నారు. గత ఐదేళ్లలో మార్కెట్‌యార్డు కార్యకలాపాలు నిర్వీర్యం అయ్యాయన్నారు. అధికారులతో మాట్లాడి ఏఎంసీకి ఆదాయ వనరులు ఎలా వస్తాయో తెలుసుకుని అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, సూరపనేని చిన్ని, మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్ర కుమార్, పెనుమాక జయరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపసర్పంచులకు శిక్షణ

నిడదవోలు, అక్టోబరు 10: సమిశ్రగూడెం మండల పరిషత్ కార్యాలయంలో ఉపసర్పంచులు, వార్డు సభ్యులకు గురువారం శిక్షణ నిర్వహించారు. జిల్లా ట్రైనింగ్ మేనేజర్ గుర్రాల ప్రసంగిరాజు మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచా యతీ పరిధిలో ఐదు ఫంక్షనల్ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. వీటి ద్వారా మరింత మెరుగైన సేవలు అందించవచ్చునని తెలిపారు. కార్యక్రమం లో మాస్టర్ ట్రైనీలు కె.శ్రీనివాసరావు, మొహిద్దీన్, మండలంలోని ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.




బంగారు నగల అలంకరణలో కోటసత్తెమ్మ అమ్మవారు

తాళ్లపూడిలో కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

వైభవంగా దుర్గాష్టమి పూజలు

నిడదవోలు, అక్టోబరు 10: తిమ్మరాజుపాలెం గ్రామం లోనున్న కోట సత్తెమ్మ అమ్మవారి దేవస్థానంలో దేవీ నవరాత్రుల్లో భాగంగా గురువారం ఎనిమిదో రోజు అమ్మవారికి పలు పూజలు చేశారు. బంగారు నగల అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో సహస్రనామ కుంకుమ పూజల్లో 332 మంది దంపతులు పూజలు చేశారు. గురువారం ఒక్కరోజు అమ్మవారికి రూ.1,85,004 ఆదాయం వచ్చినట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్, ఫౌండర్ ఫ్యామిలి మెంబర్ అండ్ చైర్మన్ దేవులపల్లి రవిశంకర్ తెలిపారు. దాతలు చక్కెర పొంగలి పంపిణీ చేశారు.

తాళ్లపూడి: తాళ్లపూడిలోనున్న కనకదుర్గ అమ్మవారి ఆలయంలో గురువారం దుర్గాష్టమి సందర్భంగా అమ్మవారు దుర్గమ్మ అవతారంలో దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు శివప్రసాదు ఆధ్వర్యంలో కుంకుమ పూజలు జరిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

మనస్తాపానికి గురై యువకుడి ఆత్మహత్య

దేవరపల్లి, అక్టోబరు 10: ప్రైవేటు కంపెనీలో ఆర్థిక లావాదేవీలకు మనస్తాపం చెంది ఒకవ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు వివరాల ప్రకారం... దేవరపల్లి మండలం సంగాయిగూడెం గ్రామానికి చెందిన జంపనబోయిన శివ(32) జంగారెడ్డిగూడెంలోని ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి రెండేళ్ళ క్రితం వివాహం కాగా, జంగారెడ్డిగూడెంలో ఉంటున్నారు. సొంతూ రైన సంగాయి గూడెంలో తల్లి వద్ద 8న రాత్రి ఉండిపోయాడు. బుధవారం ఉదయం శివ వాంతులు చేసుకోవడంతో తల్లి, కుటుంబ సభ్యులు నిడదవోలులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కలుపు మందు తాగడంతో పరిస్థితి విష మించగా 9న రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వారు తెలిపారు. తల్లి పెద్దింట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

కొవ్వూరు, అక్టోబరు 10: వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ కె.జగన్మోహనరావు తెలిపారు. నల్లజర్ల గ్రామానికి చెందిన బొర్రా శ్రీనివాస్ ఏడాది నుంచి కనిపించడం లేదని శ్రీనివాస్ సోదరుడు సత్తిబాబు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ బంధువుతో కలిసి శ్రీనివాస్ విశాఖ వెళ్లి వస్తుండగా దేవరపల్లిలో దిగి కొవ్వూరు వచ్చాడని, తిరిగి ఇంటికి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. కొవ్వూరు వచ్చిన శ్రీనివాస్ రామాలయం పరిసరాల్లో సంచరించినట్లు సమాచారం ఉందన్నారు. ఏడాది కాలంగా ఇంటికి తిరిగి రాలేదన్నారు. ఇప్పటివరకు చాలాచోట్ల వెతికినా కనిపించకపోవడంతో గురువారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పెరవలి, అక్టోబరు 10: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెరవలి ఎస్ఐ అప్పారావు సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై గురువారం ఆయన అవగాహన కల్పించారు. పెరవలి సెంటర్‌లో ప్రజలతో ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలకు భంగం కలిగించే పోస్టులు సోషల్ మీడియాలో పెట్టరాదన్నారు. నిరాధారమైన వార్తలు పెడితే గ్రూపు అడ్మిన్‌లపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో స్థానికులతో పాటు పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు ప్రత్యేక పీఠం

తాళ్లపూడి, అక్టోబరు 10: అయ్యప్ప భక్తులు, అయ్యప్ప మాలధారణలు అంటే గుర్తుకు వచ్చేది అయ్యర్ గురుస్వామి. కేరళ నుంచి వ్యాపారం నిమిత్తం వచ్చిన ఆయన అయ్యప్ప మాల ధారణలు ఇక్కడి వారికి అలవాటు చేయగా ప్రతి ఏడాది పడిపూజ, కలశపూజలను భక్తులు చేపట్టేస్థాయికి ఎదిగారు. ఈ ఏడాది ఒక భక్తుడు ప్రతిఫలం ఆశించకుండా తాళ్లపూడిలో అయ్యప్ప భక్తులకు ప్రత్యేక పీఠం ఏర్పాటు చేశారు. మాల ధారణ నుంచి యాత్రకు వెళ్లే వరకూ పూజలు, వడి, బిక్ష వసతి ఉచితంగా ఏర్పాటు చేశారు. ఖర్చుకు వెనుకాడకుండా అన్ని వసతులు మిత్రుల సహకారంతో ఉచితంగా అందజేస్తున్నట్లు నిర్వాహకులు ఎల్.వరప్రసాదు (బేకరి చిన్నా) తెలిపారు. తాళ్లపూడిలో ని ఆర్యవైశ్య సత్రాన్ని సంఘ చైర్మన్ సింహాద్రి జనార్ధన్ ఉచితంగా అందజేశారు. గురువారం పీఠంలో 150 మంది భక్తులు మాలధారణ చేసి పూజలు చేశారు.

ఆకట్టుకున్న బతుకమ్మ సంబరాలు

దేవరపల్లి, అక్టోబరు 10: మూడు బొమ్మల సెంటర్‌లోని సౌభాగ్య దుర్గాంబిక ఆలయం వద్ద దేవీనవరాత్రుల్లో భాగంగా గురువారం సాయంత్రం బతుకమ్మ సంబరాలు జరిపారు. వేదపండితులు పెదసనగంటి సాయిబాబు, శశికాంత్ శర్మ ఆధ్వర్యంలో బతుకమ్మ పూజలు చేశారు. మహిళలు బతుకమ్మను పువ్వులతో అలంకరించి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేసి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద బతుకమ్మ పాటలు పాడుతూ మహిళలు నృత్యాలు చేశారు. ఊరచెరువు వద్ద బతుకమ్మను నిమజ్జనం చేశారు.



దేవరపల్లిలో బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తున్న మహిళలు

భవానీ భక్తులకు జన సైనికుల చేయూత

దేవరపల్లి, అక్టోబరు 10: పాదయాత్రగా విజయవాడ వెళుతున్న భవానీ భక్తులకు యర్నగూడెం రోడ్డు పక్కన జన సైనికులు ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి భవానీ భక్తులకు భోజన వసతి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గోపాలపురం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ సువర్ణరాజు, మహిళా అధ్యక్షుడు కాట్నం గణేష్, యర్నగూడెం టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బొల్లిన విజయ్‌భాస్కర్, కృష్ణంపాలెం సర్పంచ్ నాయుడు దుర్గాప్రసాద్, త్యాజంపూడి ఎంపీటీసీ కాళ్ల వెంకటరత్న, తదితరులు పాల్గొన్నారు.



నత్త..భయం!

- పొలాలను పట్టిపీడిస్తున్న నత్తలు
- రావూరుపాడు రైతాంగం లబోదిబో

తాళ్లపూడి, అక్టోబరు 10 : నత్తలు రైతులను నట్టేట ముంచుతున్నాయి.. కొత్త కష్టం రావడంతో రైతులు విల విల్లాడిపోతున్నారు. ఎలా అరికట్టాలో తెలియక అపసో పాలు పడుతున్నారు. లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టి వేసిన పంట నాలుగు రోజులకే నాశనమై పోతుం డడంతో నలిగిపోతున్నారు. తాళ్లపూడి మండలం రావూ రుపాడు గ్రామం కూరగాయల పంటలకు ప్రసిద్ధి. ఇక్కడ వందలాది ఎకరాల్లో అన్ని రకాలు సాగు చేస్తా రు.ఆకు కూరలు, కూరగాయలు ఎక్కు వగా పండి స్తారు. క్యాలీఫ్లవర్, క్యాబేజీ, వంకాయ తదితర రకాలు సాగు చేస్తారు. వీటిని నారుదశ నుంచి పెంచాల్సి ఉంటుంది. నారు దశలోనే కాండం తినేయడంతో ఎదు గుదల ఉండడంలేదు. ఆకు కూర లదీ ఇదే పరిస్థితి. ఎందు కంటే ఇటీవల గోదావరి వరదలకు గ్రామంలో కొత్త వైరస్ పుట్టుకొచ్చింది.. అదే నత్త.. ఆ నత్తల దండు కారణంగా పంటను సర్వం కోల్పోయే పరిస్థితి ఎదు ర్కొంటున్నారు. నత్త ప్రతి పంటనూ నాశనం చేస్తోంది. ఇటీవల వరదలు వచ్చిన తరువాత నత్తలు రావూరు పాడు పొలాల్లోకి చేరాయి. ప్రతి ఆకును, చెట్టును, కాయనూ తినేస్తూ అవి పెరుగుతూ పంటలను పిప్పి పిప్పి చేస్తున్నాయి.పొలాల్లో పట్టే చీడ పీడలకు దీనికి చాలా తేడా ఉంది. ఎన్ని మందుల వేసినా నత్తలు చావడం లేదని లక్షలాది రూపాయలు నష్ట పోతున్నా మని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రేకపల్లి వీర వెంకట్రావు అనే రైతు మాట్లాడుతూ ఎక్కడి నుంచి వచ్చిందో తెలియదు కానీ పంటలను నాశం చేస్తుం దని ఎన్నో రకాల చీడపీడలు చూశాం కానీ ఇలాంటి మొండి రకాన్ని చూడలేదని ఎన్ని మందులు వాడినా ఒకటి చస్తే వంద పుడుతూ పంటను నాశనం చేస్తున్నా యన్నారు. కాలీఫ్లవర్ మొక్కలు వేస్తే కాండంతో సహా తినేశాయని ఉద్యానవన శాఖా అధికారుల సలహాతో తవుడు, బెల్లం, మోనోక్రోటోపస్ కలిపి మొక్కలకు రక్షణ గా బాటలుగా వేశామని అయినా పూర్తిగా అరికట్టలేక పోతున్నామని వాపోయారు. మరో రైతు పుప్పాల సత్య నారాయణ మాట్లాడుతూ ఎప్పుడూ ఈ గ్రామంలో నత్త లు లేవని నత్తలు కనపడడం ఇదే మొదటిసారి అని వీటిని అరికట్టక పోతే చుట్ట ప్రక్కల గ్రామాల రైతులకు కూడా ప్రమాదం ఉందని అధికారులు ఉన్నతస్థాయి లో పరిశోధన జరిపి రైతులను ఆదుకోవాలని కోరారు. లేకపోతే మండలం మొత్తం వ్యాపించే ప్రమాదం ఉం దని.. అధికారులు మేల్కోవాలన్నారు.

నత్తలను నిర్మూలించలేం..

ఉప్పు చల్లడం ద్వారా నత్తలను నివారించవచ్చు. గోనె పట్టాలను తడిపి నత్తలు తిరిగే ప్రదేశాల్లో నేలపై పరచాలి. చల్లదనానికి గోనె పట్టాల కిందకి చేరిన నత లను పట్టుకుని ఉప్పునీటి ద్రావణంలో వేయడం ద్వారా అరికట్టవచ్చు. పంటలను కాపాడుకోవడానికి చర్యలు తప్ప నత్తలను సమూలంగా నిర్మూలించలేం.

- ఏవో రుచిత, హార్టికల్చర్ అధికారి శ్రీనివాస్

రొటీన్ లైఫ్ కి భిన్నంగా!

జీవితం అంటే ఇంతేనా.. చాలా మందికి వచ్చే క్వశ్చన్ మార్క్ ఇది.. కొత్తగా ఏదో ఒకటి చేయాలని అనుకుంటారు.. అయితే అందరూ అలా చేయలేదు.. కొంత మంది మాత్రమే ఆ వైపు అడుగులు వేస్తారు.. ఈ చిత్రంలో చూస్తున్నారుగా ఇతని పేరు అన్నెంనీడి మనోజ్ కుమార్.. బెంగళూరులో ఐటీ ఉద్యోగి.. ఏ కష్టం లేదు.. ఆ జీవితం రొటీన్ అనిపించింది.. దేశంలో ఐదు వేల కిలోమీటర్లు సైకిల్ యాత్ర చేయాలని తలంచారు.. అనుకున్నదే తడవుగా గత నెల 28వ తేదీన యాత్ర ప్రారంభించారు.. గురువారానికి రాజమహేంద్రవరం చేరుకున్నారు.. 48 రోజుల్లో మరో 4 వేల కిలోమీటర్లు కవర్ చేయాలని చెప్పుకొచ్చారు.. రాజమహేంద్రవరం లో తన మావయ్య ఉన్నట్టు చెప్పారు.

- రాజమహేంద్రవరం సిటీ



చిరుత..కు ఏమైంది!?



చిరుత ముందుగా కెమెరాకు చిక్కిన ప్రాంతమిదే..

- గత నెల 6న ప్రత్యక్షం
- రిజర్వు ఫారెస్టులో 18 రోజులు
- బోనుకు చిక్కకుండా తిరిగిన వైనం
- చివరిగా వీరవరంలో అడుగులు
- రావులపాలెంలో పుకార్లు
- అక్కడి నుంచి కానరాని జాడ
- 35 రోజులైనా స్పష్టత శూన్యం
- బతికే ఉందా? అనే అనుమానం
- జనాల్లో ఇంకా వీడని భయం..
- అటవీ అధికారుల మౌనం


అడవి నుంచి జనారణ్యంలోకి వెళ్లి అదృశ్యం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

అడవిలో ఉండాల్సిన చిరుత దారితప్పి జనార ణ్యం లోకి వచ్చి అదృశ్యమైంది. నెల రోజుల పాటు అటవీ అధి కారుల హడావుడి నుంచి చాకచక్యంగా తప్పించు కుంటూ ట్రాప్ కెమెరాలకు మాత్రం ఫోజులిచ్చింది. తర్వా త జాడ మాయమైంది. అసలు చిరుత బతికే ఉందా? జనాల్లో ఉందా? వనాలకు వెళ్లిపోయిందా?..ఏ ప్రశ్నకూ ఇతమి త్థంగా సమాధానం లేదు. జనాలు ఇప్పటికీ భయ పడుతూనే సంచరిస్తుండగా అటవీ అధికారులు మాత్రం పది రోజుల నుంచీ దాని ఊసే మరి చినట్టుగా కనిపి స్తోంది.చిరుత సమాచారాన్ని మీడియాకు చేరవేయడానికి ఏర్పాటు చేసిన వాట్సాప్ గ్రూపు కూడా ఈ నెల 1 నుంచి మూగ బోయింది. ఇటీవల బెంగళూరులో ఓ చిరుతపులి అకస్మాత్తుగా ఓ ప్రయాణికుల బస్సుపై దాడి చేసి కిటికీల గుండాలోపలికి ప్రవేశించడానికి ప్రయ త్నించిన వీడియో హల్‌చల్ చేస్తుండడంతో ఇక్కడి ప్రజల్లో మళ్లీ ఆందోళన మొదలైంది.ఏ మూల నక్కి ఉందో.. ఠక్కున ఎప్పుడొస్తుం దో అనే భయం ఇప్పటికీ ఉంది. జనాల్లో భయం.. అధికారుల్లో మౌనంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

గత నెల 6న చిరుత జాడ

చిరుత జాడను దివాన్ చెరువు రిజర్వు ఫారె స్టులో గత నెల 6వ తేదీన గుర్తించారు.ఆ తర్వాత అటవీ అధికారులు 70 ట్రాప్ కెమెరాలు, 10 వరకూ బోనులు, సుమారు 100 మంది సిబ్బంది, థర్మల్ ఇమేజ్ డ్రోన్ కెమెరా, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అయినా రిజర్వు ఫారెస్టులో ఉన్నంత వరకూ దానిని బంధించలేక పోయారు. అనంతరం దివాన్‌చెరువు అభయారణ్యం నుంచి సుమారు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న కడి యపులంకలోని ఓ నర్సరీలో ప్రత్యక్షమైంది.తర్వాత నుంచి దాని జాడ అదృశ్యమైంది. ఓ పది రోజులుగా ఫారెస్టు సిబ్బంది మర్చిపోయారు.చిరుత వెనక్కి వెళ్లిపోయి ఉండొ చ్చని ఇప్పుడు అధికారులు అంచనా వేస్తున్నారు. ఏ అం శాలను పరిగణనలోకి తీసుకొని చిరుత వెనక్కి వెళ్లి ఉండొ చ్చని చెబుతున్నారో తెలియడం లేదు. పులి, చిరుత వంటి వణ్యప్రాణులు వాటి విసర్జితాల వాసన ఆధారంగా సంచరిస్తూ ఉంటాయి.ఇప్పు డు చిరుత వెనక్కి వెళ్లాలంటే ఆ ఆధారాలు కూడా లేవు. వర్షాల వల్ల చెరిగిపోయాయి. కడియపులంక నుంచి దివాన్ చెరువు వరకూ చిరుత రావడం చాలా కష్టం. ఇక కిలోమీటర్ల అవతల ఉన్న దాని గూటికి చేరుకోవడం ఊహకు అందని అంశం.



గత నెల 6న కెమెరాకు చిక్కిన చిరుత (ఫైల్)

ప్రయత్న లోపమేనా?

తూర్పుగోదావరి డీఎఫ్‌వో దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో కాకినాడ జిల్లా అటవీ అధికారి (డీఎఫ్‌వో)ని ఇంచార్జి డీఎఫ్‌వోగా నియమించారు. ఆమె నేతృత్వంలో సుమారు 50 మంది బృందా లుగా ఏర్పడి చిరుత కోసం అన్వేషణ సాగిం చాయి. 530 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్న రిజర్వు ఫారెస్టులో 50 వరకూ ట్రాప్ కెమెరాలను, ఇన్ ఫ్రారెడ్ కెమెరాలను చెట్లకు బిగించారు.చిరుత పులి కడి యపులంకలో కనిపించిన వెంటనే కోన సీమ డీఎఫ్‌వోని రంగంలోకి దింపారు. అయినా ఫలితం శూన్యం. ఇప్పుడు తూర్పు డీఎఫ్‌వో బదిలీపై వెళ్లి కొత్తగా రవీంద్ర ధామా రెండు రోజుల కిందట జాయిన్ అయ్యారు. ఈయన మళ్లీ వెతుకులాట ఎక్కడి నుంచి ఆరంభిస్తారో చూడాల్సిందే.

గత నెల 24న చివరిగా..

చిరుత సమాచారంపై ప్రతి రోజూ ఫారెస్టు అధికారులు మీడియాకు సమాచారం ఇస్తూ వచ్చారు.ఈ క్రమంలో ఒక వాట్సాప్ గ్రూప్‌ని క్రియేట్ చేశారు. ఇది ఈ నెల 2 నుంచి మూగ బోయింది. చివరిగా 1వ తేదీ సాయంత్రం ఇన్ చార్జి డీఎఫ్‌వో భరణి పేరుతో.. 'చివరిగా సెప్టెంబరు 19న దివాన్ చెరువు అటవీ ప్రాం తంలో చిరుతపులి తిరుగుతున్నట్టు ట్రాప్ కెమె రాకు చిక్కింది. 24న రాత్రి కడియం నుంచి వీరవరం వెళ్లే రోడ్డులో దోసాలమ్మ కాలనీ దగ్గర లోని ఎస్ఎస్‌టీసీ నర్సరీలో చిరుతపులి పాద ముద్రలు గుర్తించాం.అదే రోజున వర్షం పడడంలో ఆ పాదముద్రలు పోయినవి. 19 నుంచి 30 వరకూ దివాన్ చెరువు అటవీ ప్రాంతంలో, పరిసర ప్రాంతాల్లో అమర్చిన ట్రాప్ కెమెరాలను, సీసీ కెమెరాలను పరిశీలించగా చిరుతపులి కదలికలు లేవు. 29న అంబే ద్కర్ కోనసీమ జిల్లాలో గోదావరి నదిలో మత్స్యకారులు చూసినట్టుగా వచ్చిన సమాచారంపై సిబ్బంది ఆరు బృం దాలుగా ఏర్పడి ఆ ప్రాంతాల్లో క్షుణ్ణంగా తనిఖీ చేసినా ఎలాంటి ఆధారాలూ లభించలేదు. రేపటి(ఈ నెల 2) నుంచి చిరుతపులి జాడ కోసం రెండు బృందాలను ఏర్పా టు చేసి తూర్పుగోదావరి జిల్లా దివాన్ చెరువు, కడియం, కోనసీమ జిల్లా రావులపాలెం పరిసరాలు, గోదావరి లంకల్లో గాలింపు చర్యలు చేపట్టడం జరుగుతుంది. లాలా చెరువులోని గోదావరి పుష్కరవనాన్ని 2వ తేదీ నుంచి తిరిగి పునఃప్రాంభిస్తారు' అని పోస్టు పెట్టారు.

చిరుత బతికే ఉందా?

గత నెల 6న రాజమహేంద్రవరం శివార్లలో చిరుత సంచారం వెలుగు చూసింది. చివరిగా గత నెల 19న ట్రాప్ కెమెరాకు చిక్కింది. సుమారు 20 రోజులవుతున్నా కెమెరాలో ఫొటో, పాదముద్రలు, జంతువులను వేటాడిన, మనుషులపైకి వచ్చిన అనుపానులు లేవు. అసలు ఎవ రికీ కనిపించిన దాఖలా లేదు. ట్రాప్ కెమెరాలు, సీసీ కెమెరాలు,అటవీ శాఖ బృందాలు జాడ గుర్తించే పనిలోనే ఉన్నాయని, బోన్లు కూడా ఇంకా తీయలేదని అటవీ అధి కారులు చెబుతున్నాయి.ఆయా ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయడం మాత్రం ఆపేసినట్లే కనిపిస్తోంది. అయితే వెనక్కి మళ్లి ఉండొచ్చని అంటున్న అధికారులు.. ముందుకు ఎందుకు వెళ్లకూడదనే ఆలోచన చేయడం లేదని తెలుస్తోంది.కడియపులంకలో చివరిగా కనిపించిన తర్వాత రావులపాలెంలో కనిపించిందనే చర్చ నడి చింది. అలా ముందుకు వెళ్లిందని అనుకుంటే కాకినాడ, అమ లాపురం వైపు ప్రయాణించే అవకా శం లేకపోలేదు. లంకల్లోకి వెళ్లే క్రమంలో లేదా గోదావరి పాయలు దాటే సమయంలో చిరుతకు హాని జరిగిందా? అనే అనుమా నాలు బలపడుతున్నాయి.గత నెల 29న కోనసీమ పరిధి లోకి వచ్చే గోదావరి నదిలో చిరుతను చూశామని కొం దరు మత్స్యకారులు చెప్పగా అటవీ సిబ్బంది వెళ్లి వెతి కినా ఫలితం లేకపోయింది. దీంతో గోదావరి ఒడిలో ప్రమాదానికి గురైందా?లేక ఎక్కడైనా ఊబల్లో చిక్కు కుందా అనే వాదనా లేకపోలేదు. అదే గనుక నిజమైతే వన్యప్రాణిని దక్కించుకోలేని మరక జిల్లాకు అంటుకోక తప్పకపోవచ్చు.చిరుత వల్ల తాత్కాలి కంగా మూసేసిన పుష్కర వనాన్ని ఈ నెల 2 నుంచీ తెరిచారు.ఒకవేళ అధి కారుల అంచనా వేస్తున్నట్టు వెనక్కి మళ్లి ఉంటే దివా న్ చెరువు రిజర్వు ఫారెస్టులోకి ప్రవే శించి ఉండాలి.కానీ ఇక్కడా ఏలాంటి జాడా లేదు. ఇలా భయంతో రకరకాల అయోమయాలు ప్రజల మెదడును తొలిచేస్తున్నాయి.

మంత్రి నాదెండ్ల తనిఖీ.. 96,270 కేజీల బియ్యం పట్టివేత

- 3 రైస్‌మిల్లుల్లో చిక్కిన బియ్యం
- విలువ రూ.36,52,285 : జేసీ



నల్లజర్లలో తనిఖీ చేస్తున్న మంత్రి నాదెండ్ల(ఫైల్)

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 10: రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ జిల్లా పరిధిలో ఈనెల 9న రాత్రి నిర్వహించిన తనిఖీల్లో మొత్తం 96,270 కేజీల పోర్టిఫైడ్ బియ్యం గుర్తించారని జేసీ పి.చిన్నరాముడు తెలిపారు. ఈ మేరకు మంత్రి తనిఖీల్లో పట్టుబడిన బియ్యం వివరాలను గురువారం వెల్లడించారు. నల్లజర్ల శ్రీ వెంకట సత్యరైస్ అండ్ ఫ్లోర్ మిల్లులో ఎటువంటి రికార్డులు లేకుండా ఉన్న రూ. 36.40 లక్షలు విలువ చేసే 80 వేల కేజీల బియ్యం, దేవరపల్లికి చెందిన వరలక్ష్మి రైస్‌మిల్లు యజమాని సిహెచ్.అప్పారావుకు సంబంధించిన రూ.12,285 విలువ చేసే 270 కేజీల బియ్యం, దేవరపల్లికి చెందిన శ్రీవెంకటేశ్వరా రైస్‌మిల్లు యజమాని సిహెచ్ హరిబాబుకు చెందిన 16 వేల కేజీల బియ్యం సీజ్ చేసారని తెలిపారు.మొత్తం పట్టుకున్న బియ్యం విలువ రూ.36,52,285లు ఉంటుందన్నారు. సంబంధిత వ్యక్తులపై నిత్యావసర వస్తువుల చట్టం 1955 సెక్షన్ 6ఎ ప్రకారం కలెక్టర్ (పౌరసరఫరాలు) జిల్లా కోర్టులో కేసు నమోదు చేశారన్నారు. సంబంధిత పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసులు నమోదు చేసినట్టు పేర్కొన్నారు.

14 షాపులు.. 614 దరఖాస్తులు

మూడు మండలాల్లో రూ. 12.28 కోట్ల ఆదాయం

దేవరపల్లి, అక్టోబరు 10 : దేవరపల్లి ఎక్సయిజ్ స్టేషన్ పరిధిలో 14 షాపులకు 614 దరఖాస్తుల ద్వారా రూ.12.28 కోట్ల ఆదాయం సమకూరిందని దేవరపల్లి ఎక్సయిజ్ సీఐ బళ్ళా శ్రీనివాసరావు అన్నారు. దేవరపల్లి ఎక్సయిజ్ సీఐ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. దేవరపల్లి సర్కిల్ పరిధిలో దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాలకు 14 షాపులు కేటాయించగా బుధవారం సాయంత్రానికి 614 దరఖాస్తులు అందాయన్నారు.దేవరపల్లి మండలం 5, గోపాలపురం మండలం3, నల్లజర్ల మండలంలో 6 షాపులకు అనుమతివ్వడం జరిగిందన్నారు.

పుట్టినరోజు పార్టీకి డ్రగ్స్

పోలీసులకు చిక్కిన తాడేపల్లిగూడెం యువకులు 8

ఇసుక.. టెండరింగ్!



మాకు వస్తుందో రాదో : కలెక్టరేట్‌లో జేసీ చాంబర్ వద్ద ఓపెన్ ఇసుక ర్యాంపు కేటాయింపునకు బయట వేచి ఉన్న టెండరుదారులు

17 ఓపెన్ రీచ్‌లకు 145 దరఖాస్తులు

- ఇసుక టెండర్లలో గుత్తాధిపత్యం
- ముందుగానే కేటాయింపులు?
- ఆ తరువాతే టెండర్లు
- చక్రం తిప్పిన ఒక నేత అనుయాయులు
- దరఖాస్తుదారుల విస్మయం

రాజమహేంద్రవరం రూరల్/ సిటీ, అక్టోబరు 10 : ఓపెన్ ఇసుక ర్యాంపులు అక్రమార్కులకు ఓపెన్ అయినట్టు తెలిసింది. ఆయా ర్యాంపుల్లో టెండరింగ్ అయినట్టు సమాచారం. ఎవరికి ఏ ర్యాంపు కావాలో ముందుగానే నిర్ణయించి అధికారుల చెవిన వేసినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. దీంతో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచిత ఇసుక విధానం ఏ విధంగా సాగుతుందోననే అనుమానాలున్నాయి. జిల్లాలో ఓపెన్ ఇసుక ర్యాంప్‌ల కేటాయింపుల కోసం ప్రభుత్వం నిర్వహించిన టెండర్లలో ఇద్దరు కీలక నాయకులు గుత్తాధిపత్యం ప్రదర్శించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జేసీ చాంబర్ వద్ద కూర్చుని వారు ఓపెన్ ర్యాంప్‌ల కేటాయింపుల కోసం నిర్వహించిన టెండర్ల ప్రక్రియలో చక్రం తిప్పారు. వారి హవాకు అధికారులు సైతం మిన్నకుండడం పలు విమర్శలకు తావిస్తోంది. పలువురిని బుధవారం టెండర్లు దాఖలు చేయకుండా అడ్డుకున్న నాయకులు గురువారం కేటాయింపులు జరిగిన ప్రక్రియలో కూడా ప్రతి ర్యాంపులోను వేలు పేట్టేశారు. జిల్లాలో 17 ఓపెన్ రీచ్‌లు ఉన్నాయి. వేమగిరి దగ్గర రెండు రీచ్‌లు, బుర్రిలంక, వెంకటనగరం, బొబ్బిల్లంక, వంగలపూడి, సీతానగరం మూడు, తాళ్లపూడి, కొవ్వూరు రూరల్ 2, పెరవలి 2, నిడ దవోలు తదితర ర్యాంపులు ఉన్నాయి. 17 ఓపెన్ రీచ్ లకు సం బంధించి మొత్తం 145 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో ఆయా టెండరుదారులు వేసిన బిట్‌లను బట్టి కేటాయింపులు చేయాల్సి ఉంది. అయితే ఆయా కేటాయింపుల్లో కూడా వారు ప్రమేయం ప్రదర్శించడం విడ్డూరంగా ఉంది.జేసీ చాంబర్‌లో శాండ్ కమిటీ అధికారులతో పాటు వారిద్దరు కూర్చుని చక్కబెట్టినట్టు సమాచారం. ఇసుక రీచ్‌ల కేటాయింపులను చాలా పారదర్శకంగా నిర్వహించాలని కూటమి ప్రభుత్వం యోచించి అధికారులకు అన్నీ అప్పగిస్తే వారిని ఒత్తిడి చేసి సీనియర్ ఎమ్మెల్యే అనుచరులు ఇద్దరు అను సరిస్తున్న విధానాలు ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఇసుక టెండర్లు ప్రభుత్వానికి మచ్చ

ఇసుక టెండర్లు కేటాయింపుల్లో జేసీ ఛాంబర్‌లో కొంత మంది గుత్తేదారుల దౌర్జన్యం కూటమి ప్రభుత్వానికి మచ్చ తీసుకువస్తుందని బీజేపీ ఓబీసీ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపి శ్రీనివాస్ ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసుక కొరత రాకుండా చూసి భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలను కాపాడాలన్నారు. అధికారులు నిబంధనలు పాటించాలన్నారు. టెండర్లు పిలిచిన విధానంలో ఉన్న లోపాలు చూస్తేనే ఎంత అక్రమంగా జరిగిందో అర్థమవుతుందన్నారు.గత ప్రభుత్వం ఇసుక అక్రమాల్లో పాలు పంచుకున్న గుత్తేదారులు ఇప్పుడు టెండర్లలో కూడా పాల్గొని గుత్తాధిపత్యం చెలాయించడం కనిపిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచిత ఇసుక పాలసీకి గుత్తేదార్లు తూట్లుపొడుస్తున్నారని ధ్వజమెత్తారు.



వంట నూనెలు కాగుతున్నాయ్!

రెండు నెలలుగా పెరుగుతున్న ధర

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

వంటనూనె ధరలు భగ్గుమంటున్నాయి.. ఎక్కడా దిగిరావడంలేదు..అంతకంతకూ పెరుగుతూనే ఉన్నాయి. దిగుమతి సుంకం పెంచారనే కారణంతో వంట ఆయిల్ ధరలు విపరీతంగా పెంచేశారు. కొద్ది రోజుల కిందటే ధరలు పెంచగా ప్రభుత్వం ఆగ్రహించి అధికారులతో విస్తృతంగా దాడులు చేయించడంతో కేసులు కూడా నమోదు చేశారు. దీంతో కొద్ది రోజులు నూనె ధరలు అరికట్టిన సంగతి తెలిసిందే. కానీ వ్యాపారులు మళ్లీ నూనె ధరలు పెంచారు. అయితే మళ్లీ ఏం జరిగిందో తెలియదు కానీ ధరలు మాత్రం కిలోకు రూ. 20ల మేర పెంచేయడం గమనార్హం.ఫ్రీడమ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ రెండు నెలల కిందట రూ.112లు మాత్రమే ఉండేది. ప్రస్తుతం కేజీ రూ.130కు విక్రయిస్తున్నారు. కొద్దిరోజుల కిందటి వరకూ రూ.110 నుంచి రూ.115 వరకూ అమ్మేవారు.పామాయిల్ రూ. 120లకు విక్రయిస్తున్నారు. పది కేజీల ఆయిల్‌కు హోల్‌సేల్‌లో సుమా రు 300 పెరిగినట్టు చెబుతున్నారు.పాత నిల్వలను ధరలు మార్చి అమ్మేస్తున్నారు. అయినా అధికారులెవరూ పట్టించుకోవడంలేదు. మరో పక్క మార్కెట్‌లో కందిపప్పు కేజీ ధర రూ. 151కే అమ్మాలని అధికారులు ఆదే శించినా వేంకటేశ్వర మార్కెట్‌లో రూ.170 తీసుకుంటున్నారు. ఎవరైనా ఇదేంటని అడిగితే ఇది మంచిరకం అని చెబుతున్నారు.

వంట నూనె ధరలు తగ్గించాలి జేసీ చిన్నరాముడు

వంటనూనెలను వినియోగదారులకు తక్కు వ ధరలకే విక్రయించాలని జేసీ ఎస్. చిన్నరాముడు సూచించారు. పౌరసరఫరాల కార్యాలయంలో గురువారం నిర్వహించిన ధరల పర్యవేక్షణ కమిటీ సమీక్షలో పలు సూచనలు చేశారు.హోల్‌సేల్, రిటైల్ వద్ద ధరల పట్టిక ఏర్పాటు చేయాలని ఆదేశించారు.అన్ని హోల్‌సేల్,రిటైల్ మార్కెట్లలో నిబంధనల మేరకు మాత్రమే ధరలు ఉండాలన్నారు.రైతు బజార్లు, మండల కేంద్రాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. అధికారులు తనిఖీ చేయాలన్నారు.